

రూ.2,139 కోట్లతో క్రిస్ సిటీ

- 2,500 ఎకరాల్లో పారిశ్రామికవాడ ఏర్పాటు
- రూ.10,500 కోట్ల పెట్టుబడులు రాబట్టడమే లక్ష్యం
- పరిశ్రమలకు రాయితీలు ఇస్తామన్న ప్రభుత్వం
- 98 వేల మందికి ఉపాధి కల్పన

నెల్లూరు (ఆంధ్రజ్యోతి), ఆగస్టు 28 : రూ.2139 కోట్లతో క్రిస్ సిటీ (కృష్ణపట్నం ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ)ను ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు సంబంధించిన నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమైనట్లు వెల్లడించింది. వికసిత భారత్ లక్ష్యంలో భాగంగా దేశవ్యాప్తంగా 12 ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలను కేంద్రం అభివృద్ధి చేస్తోంది. ఇందులో కృష్ణపట్నం పారిశ్రామిక వాడ కూడా ఎంపికైంది. చెన్నై-విశాఖ, చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లను అనుసంధానం చేస్తూ క్రిస్ సిటీ రూపుదిద్దుకుంటోంది. భారత తూర్పు తీరంలో క్రిస్ సిటీ అతిపెద్ద పారిశ్రామిక వాడగా రూపాంతరం చెందనుంది. మొత్తం 2500 ఎకరాల్లో కృష్ణపట్నం పారిశ్రామిక ప్రాంతాన్ని కేంద్రం అభివృద్ధి చేయనుంది. కృష్ణపట్నం పోర్టుకు అనుసంధానిస్తూ నిర్మించబోతున్న ఈ పారిశ్రామిక వాడలో రూ.10,500 కోట్ల పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా నిర్దేశించారు. సుమారు 98వేల మందికి ఉపాధి కల్పనకు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్, ఆగ్రో ప్రాసెసింగ్, ఫార్మా సిటికల్స్, టెక్స్‌టైల్ పరిశ్రమలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు కేంద్రం ప్రకటించింది. క్రిస్ సిటీలో ఏర్పాటు చేయబోయే పరిశ్రమలకు రాయితీలు కూడా ఇవ్వనున్నట్లు వెల్లడించింది.

పంచాయతీ కార్యదర్శులకు రేపటి నుంచి బదిలీల కౌన్సెలింగ్

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 28: జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల బదిలీలకు ఈ నెల 30, 31వ తేదీలలో కౌన్సెలింగ్ చేపడుతున్నట్లు డీపీవో సుస్మితారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రేడ్-5 ఉద్యోగులు 160మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారని, వారందరికీ 30న ఉదయం పది గంటల నుంచి జడ్పీ కార్యాలయంలో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. అలాగే గ్రేడ్-4డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు 176 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరందరికీ 31న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీల ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు.

సెబ్ కథ ముగిసింది!

- ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో విలీనం
- బాణసంచా కాల్చిన అధికారులు

నెల్లూరు (క్రైం), ఆగస్టు 28 : గత ప్రభుత్వంలో ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసు శాఖను సమ్మేళనం చేస్తూ తీసుకువచ్చిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) కథ ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అమరావతిలో నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో సెబ్‌ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఒక టీ రెండు రోజుల్లో ఉత్వర్వులు జారీ కానున్నాయి. సెబ్‌లో నిజాయితీగా విధులు నిర్వహిస్తున్న పలువురు ఎక్సైజ్ అధికారులు సెబ్ రద్దు కావడంతో ఆయా పోలీసు స్టేషన్ పరిధిలలో టపాసులు కాల్చి పండుగ చేసుకున్నారు. అయితే సెబ్ ఏర్పడిన తరువాత అవినీతే హద్దుగా చెలరేగిపోయిన అధికారులు మాత్రం తమ బాధను ఎవరికి వ్యక్తం చేసుకోవాలో తెలియక వారిలో వారే కుమిలిపోతున్నారు.



ఎక్సైజ్ జిల్లా కార్యాలయంలో టపాసులు కాలుస్తున్న సిబ్బంది

ఇసుక కొరత రానీయొద్దు : జేసీ

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఆగస్టు 28 : జిల్లాలో గుర్తించిన ప్రదేశాల్లో డీసిల్టేషన్ ప్రక్రియ ద్వారా ఇసుక సరఫరా చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని, కొరత అనే మాట రానీయొద్దని జాయింట్‌కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో డీసిల్టేషన్ ప్రక్రియ చేపట్టేందుకు ఆసక్తి ఉన్న వారితో జేసీ సమావేశమయ్యారు. ప్రజలకు ఇసుక కొరత లేకుండా వెంటనే డీసిల్టేషన్ పద్ధతిలో ఇసుక సరఫరా ప్రారంభించాలన్నారు. నెల్లూరు, సంగం బ్యారేజీలతోపాటు సూరయపాళెం ప్రాంతాల నుంచి డ్రెడ్జింగ్ చేసి ఇసుకను అందించాలన్నారు. పూర్తి పారదర్శకంగా బిల్లింగ్ విధానంలో ఇసుక సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మైనింగ్ శాఖ డీడీ శ్రీనివాసకుమార్, ఆర్డీవో చందర్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో సెస్ బకాయిలు రూ.40 కోట్లు

సంగం, ఆగస్టు 28 : జిల్లాలో గ్రంథాలయాలకు సుమారు రూ.40.45 కోట్ల మేర సెస్ బకాయిలు ఉన్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్ రాజా తెలిపారు. బుధవారం సాయంత్రం సంగంలోని గ్రంథాలయాన్ని పరిశీలించి, పలు రికార్డులను తనిఖీ చేశారు. పుస్తకాలను పరిశీలించి గ్రంథాలయాధికారి రవీంద్రనాథ్‌రెడ్డికి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా కుమార్‌రాజా మాట్లాడుతూ జిల్లాలో ఒక్క కార్పొరేషన్ నుంచే సుమారు 34.45 కోట్ల సెస్ బకాయి ఉన్నట్లు తెలిపారు. పంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి మరో రూ.6 కోట్లు ఉన్నట్లు చెప్పారు. అలాగే సిబ్బంది కొరతతోపాటు 12 గ్రంథాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వీటిని అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మరోవైపు గ్రంథాలయాలకు పాఠకుల రాక పెరగడంతో దిన పత్రికలతో పాటు, వార పత్రికలు తెప్పిస్తున్నట్లు చెప్పారు.

31నే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 28 : సెప్టెంబరు నెల సామాజిక పెన్షన్లను ఈ నెల 31నే పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 1వ తేదీ ఆదివారం సెలవు కావడంతో ఒక రోజు ముందుగానే పెన్షన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. 31న పెన్షన్లు అందుకోలేని వారికి 2వ తేదీన ఇవ్వనున్నట్లు తెలిపారు.

నా జీతభత్యాలు ఇవ్వండి!

- 19 నెలలకు రూ.4.43 లక్షల బకాయి
- అంతవరకు 'కృష్ణాష్టమి' వేడుకలకు సహకరించను
- ఈవోలకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు
- వేణుగోపాలస్వామి ఆలయ ప్రధాన అర్చకుడి ఆవేదన

ఉలవపాడు, ఆగస్టు 28 : వేణుగోపాల స్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకల నిర్వహణకు సహరించేది లేదని ఆ ఆలయ ప్రధాన అర్చకుడు చక్రవర్తుల రంగనాథాచార్యులు భీష్మించి కూర్చున్నారు. కృష్ణాష్టమి సందర్భంగా స్వామివారికి పల్లకి, ఊంజల్ సేవతోపాటు ఆలయ ప్రాంగణంలో భక్తుల నడుమ ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలు బుధవారం జరగవలసి ఉండగా తాను సహకరించనని ప్రధాన అర్చకుడు తేల్చి చెప్పారు. 19 నెలలుగా తనకు జీత భత్యాల కింద రూ.4,43,780 చెల్లించాల్సి ఉందని తెలిపారు. అంతవరకు స్వామి వారికి నిత్యకైంకర్యాలు ఆగకుండా జరుపుతానని సిబ్బందికి తేల్చి చెప్పారు. జీతంతో పాటు యేటా జరిగే బ్రహ్మోత్సవాలు, పవిత్రోత్సవాలకు అదనపు అర్చకులు, స్వాములు, పూజా ద్రవ్యాలు, వస్త్రాలు తన సొంత సొమ్ముతో జరిపించినట్లు తెలిపారు. అప్పట్లో ఈవోలు జానకమ్మ, కేవీపీ ప్రసాద్‌లు ఆడిట్ పూర్తికాగానే బకాయి చెల్లిస్తామని చెప్పి కాలం గడుపుకొచ్చారని వాపోయారు. దేవస్థానం ఆదాయం లక్షల్లో వస్తున్నా తనకి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆవేదన చెందారు. ఇదే విషయాన్ని దేవదాయ శాఖ కమిషనర్ సత్యన్నారాయణకు మంగళవారం వాట్సప్ మెసేజ్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



ఉలవపాడులోని వేణుగోపాలస్వామి ఆలయం



విడవలూరులో కేవీకే భవన నిర్మాణ దుస్థితి

అడుగడుగునా ఆటంకాలే..!

ఆటలకు పునాది పాఠశాలల్లోనే. ఆటలకు ఓనమాలు దిద్దుకుని అంచెలంచెలుగా ఎదిగేందుకు అవసరమైన వాతావరణాన్ని పాఠశాలలకు కల్పించాలి. కానీ విద్యారంగంలో పెరిగిన పోటీ, కార్పొరేట్‌ల కలుషితం, సరైన ప్రణాళిక లేకపోవడం తదితర అంశాల కారణంగా పోటీలు నిస్సారంగా ముగుస్తున్నాయి. యేటా పాఠశాల, మండల, జోన్ స్థాయి, జిల్లాస్థాయి, క్రీడోత్సవాలను జరిపి క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీయాల్సిన అధికారులు వారి బాధ్యతలను పూర్తిగా విస్మరించారన్న విమర్శలు ఉన్నాయి. నిధుల కొరతతో పాఠశాల క్రీడలు కొట్టుమిట్టాడుతున్నాయి. క్రీడల నిర్వహణకు కృషి చేయాల్సిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర బాధ్యులు సకాలంలో షెడ్యూల్ విడుదల చేయకపోవడంతో ఆటలు అటకెక్కుతున్నాయి. ఆటలపై పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థ లేకపోవడంతో నిర్వహణా కార్యదర్శులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారుతోంది. విద్యాశాఖకు వీటిపై పట్టు లేకపోవడంతో క్రీడావ్యవస్థ నిర్వీర్యమైపోతోంది. ఇప్పటికైనా అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు సమన్వయంతో వ్యవహరించి జిల్లా పాఠశాలల క్రీడా వ్యవస్థను గాడిలో పెట్టాల్సిన అవసరం ఉందని క్రీడా ప్రముఖులు కోరుతున్నారు.



క్రీడారంగంలో కానరాని ప్రగతి

ప్రోత్సాహాన్ని విస్మరించిన గత వైసీపీ సర్కారు

జీవో నెం.20తో క్రీడాకారులపై ఆర్థిక భారం

కాగితాల్లోనే కేవీకేల నిర్మాణం

నేడు జాతీయ క్రీడా దినోత్సవం



కందుకూరు జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఇం డోర్ స్టేడి యం నిర్మా ణం కోసం రూ.60 లక్షల మంజూరు కాగా 2018, డిసెంబరులో పనులు ప్రారంభించారు. దాదాపు నగం పనులు పూర్తయ్యేసరికి రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటం, అధికారం చేపట్టిన వెంటనే ప్రభుత్వం తీసుకున్న విధ్వంసక నిర్ణయాలలో భాగంగా ఈ పనులను రద్దు చేశారు. దీంతో స్టేడియం అసంపూర్తిగా నిలిచిపోయింది. గడిచిన ఐదేళ్లలో ఎవరూ పట్టించుకోక పోవడంతో దిష్టిబొమ్మలా మారిపోయింది.

- వైసీపీ తీరుకు నిలువుటద్దం

\- కందుకూరు

కలగానే వికాస కేంద్రాలు

అధికారుల పర్యవేక్షణ లోపం.. ఇంజనీరింగ్ అధికారుల ఉదాసీనతతో జిల్లాలో క్రీడా వికాస కేంద్రాల (కేవీకే) నిర్మాణాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించి వారిని జాతీయ స్థాయిలో రాణించేలా తయారుచేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కేవీకేలకు శ్రీకారం చుట్టింది. నాటి కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు వీటి శిలాఫలకాలను ప్రారంభించి తొలివిడత నిధులు కూడా మంజూరు చేశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని కావలి, వెంకటగిరి, కోవూరు, ఉదయగిరి, సూళ్లూరుపేట, ఆత్మకూరు, గూడూరు, సర్వేపల్లి, నెల్లూరు అర్బన్, నెల్లూరు రూరల్ ప్రాంతాల్లో కేవీకేల ఏర్పాటుకు సర్వం సిద్ధం చేశారు. కోవూరులో స్థల సేకరణలో ఇబ్బందులు ఉండటంతో విడవలూరు జడ్పీ ఉన్నత పాఠశాల స్థలాన్ని కేటాయించారు. ఇక్కడ సగం పనులు పూర్తి చేశారు. అలాగే ఆత్మకూరులో డీఎస్ఏకు సంబంధించిన 10 ఎకరాల్లో పనులు ప్రారంభించగా సగం పూర్తయింది. ఉదయగిరిలో 2.7 ఎకరాల్లో కేవీకే పనులు ప్రారంభించి కొద్ది నిర్మాణాలు జరిగిన వెంటనే ఆపివేశారు. కావలిలో డీఎస్ఏకు సంబంధించిన 9 ఎకరాల్లో పనులు ప్రారంభించి పెండింగ్‌లో పెట్టారు. ఇక నెల్లూరు రూరల్ కొత్తూరులో 5.25 ఎకరాలు కేటాయించారు. టెండర్ల ప్రక్రియ పూర్తయినా తెలుగుగంగ అధికారుల అభ్యంతరం, సాంకేతిక కారణాలతో పనులను నిలిపివేశారు. నెల్లూరు అర్బన్‌లో అల్లీపురం సమీపంలో 6 ఎకరాల డంపింగ్ యాడ్‌ను కేటాయించారు. అయితే డంపింగ్‌ను తొలగించడానికే రూ.3 కోట్ల వరకు ఖర్చవుతుండడంతో నిధుల కొరతతో పనులు నిలిపివేశారు.

మండల వికాస కేంద్రాలు ఏమైనట్టో!

కేవీకేలతోపాటు మండల వికాస కేంద్రాలు కూడా తెరపైకి రాగా ఉమ్మడి జిల్లా కోటలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానాన్ని కేటాయించారు. దీనికి రూ.2 కోట్లు కేటాయించారు. ఇక్కడా పనులు ప్రారంభించి సగంలోనే ఆపేశారు. ఈ కేంద్రాల్లో ఇండోర్ స్టేడియంతోపాటు చుట్టూ ప్రహరీ గోడలు నిర్మించి అవుట్‌డోర్ క్రీడలు కూడా ఆడేవిధంగా సిద్ధం చేయాల్సి ఉంది. ఒక్కో మైదానానికి రూ.2 కోట్లు చొప్పున కేంద్రం కేటాయించింది. ఆరు కేంద్రాల్లో పనులు ప్రారంభించి నిలిపివేశారు.

అసాంఘికాలకు అడ్డాగా

2018లో టీడీపీ ప్రభుత్వం ఉదయగిరికి సుమారు రూ.2 కోట్లతో ఇండోర్ స్టేడియం మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ స్టేడియం నిర్మాణాన్ని వేగంగా చేపట్టి రూ.90 లక్షల వరకు ఖర్చు చేసి శ్లాబ్ స్థాయికి తీసుకువచ్చారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పనులను పట్టించుకోలేదు. ప్రస్తుతం ఆ భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. కాగా దుత్తలూరు- సీతారామపురం మార్గంలో ఏర్పాటు చేయనున్న 167- బీజీ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఈ స్టేడియాన్ని తొలగించనున్నారు.

\- ఉదయగిరి రూరల్



ఆంధ్రజ్యోతి ఫోకస్

మొగళ్లపాళెం క్రీడాగ్రామానికి గ్రహణం

2019లో రాష్ట్రంలో జాతీయ క్రీడల నిర్వహణే లక్ష్యంగా నెల్లూరు రూరల్‌లోని మొగళ్లపాళెంలో 2014లో క్రీడా గ్రామం కోసం 150 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) రూపొందించి పంపాలని నాడు కేంద్రమంత్రిగా ఉన్న ఎం.వెంకయ్యనాయుడు అప్పటి రాష్ట్ర సర్కారును కోరారు. 2016లో 150 ఎకరాలు శాప్ పరిధిలోకి వచ్చింది. శాప్ ద్వారా డీపీఆర్ (మాస్టర్‌ప్లాన్) రూపొందించి అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన అవుట్‌డోర్, ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియాలను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కేంద్రాన్ని నెలకొల్పేందుకు అనువుగా భవనాలు నిర్మించేలా కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలి. అలా పంపిన వెంటనే ఆమోదం పొందేందుకు వెంకయ్యనాయుడు ప్రత్యేక చొరవ చూపి నాటి కేంద్ర క్రీడల మంత్రిత్వశాఖను ఒప్పించారు. రాష్ట్ర సర్కారు ఇందుకోసం శాప్ ద్వారా ప్రహరీగోడ, విద్యుత్, రోడ్లు, నీటి సౌకర్యం కల్పించేందుకు రూ.4.6 కోట్లు విడుదల చేసింది. సకాలంలో డీపీఆర్ రూపొందించి కేంద్ర సర్కారుకు పంపితే క్రీడాగ్రామం కోసం రూ.200 కోట్లతో అంతర్జాతీయ క్రీడా ప్రమాణాల కలిగిన క్రీడాప్రాంగణాలు రూపుదిద్దుకునే అవకాశం ఉందని వెంకయ్యనాయుడు సూచనలు చేసినా ప్రభుత్వం తగిన ప్రాధాన్యత చూపలేకపోయింది. జిల్లాలో రాజకీయ సమీకరణాలు, ప్రయోజనాలను పరిగణలోకి రావడంతో మొగళ్లపాళెం క్రీడాగ్రామం వేగానికి గ్రహణం పట్టింది. 2016లో రాష్ట్ర ప్రభుత్వం రూ.6కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ నిధులను భూ సేకరణలో భాగంగా రైతులకు చెల్లించి భూమిని స్వాధీనం చేసుకుంది. అయితే ఇప్పటికీ వీటి నిర్మాణాలు నత్తనడకన సాగుతుండడంతో అసలు ఇది పూర్తవుతుందా లేదా అన్న సందిగ్ధ అందరిలో నెలకొంది. అయితే తొలిదశలో రూ.8కోట్లతో మల్టీ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టేందుకు 2017, మార్చిలో భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ పనులను మాత్రం 2022లో పూర్తి చేసి 2023లో డీఎస్ఏకు అప్పగించారు. అప్పటి నుంచి ఈ ఇండోర్ స్టేడియం ప్రారంభానికి ఎదురుచూస్తోంది. డీఎస్ఏ అధికారులు మాత్రం ఈ స్టేడియంను అకాడమీలకు కేటాయించాలని ప్రతిపాదనలు పంపినా ఇప్పటికీ అతీగతీ లేదు.

కాసులు ఇస్తేనే ఎంట్రీ!

ఆడటానికి మేం సిద్ధం.. మైదానాలు, వసతులు, శిక్షకులను సమకూర్చండి చాలు.. ఇది నిన్నటి వరకు క్రీడాకారుల మాట. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో మాత్రం ఆసక్తి ఉంది కదా అని నేర్చుకుందాం, ఆడేద్దామంటే కుదరదు ఆటకు ధర చెల్లించాల్సిందేనని, ఎవరైనా సరే ఆడాలను కున్నా, శిక్షణ పొందాలనుకున్నా అడ్మిషన్ ఫీజుతోపాటు నెలవారీ నగదు చెల్లిస్తేనే మైదానంలోకి ప్రవేశం ఉంటుంది. జిల్లాలో డీఎస్ఏకు సంబంధించిన ఇండోర్ లేదా అవుట్‌డోర్ స్టేడియాల్లో అడుగు పెట్టాలన్నా, ఆటలాడాలన్నా నగదు ఖచ్చితంగా చెల్లించాలం టూ రాష్ట్ర క్రీడాపాధికార సంస్థ (శాప్) ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు ఆసక్తి కలిగిన విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఆయా క్రీడలకు ఎంపిక చేసి పోటీల కోసం మైదానాలకు పంపిస్తారు. గతంలో వీరంతా ఒక్క పైసా కూడా చెల్లించకుండానే క్రీడాకారులుగా రాణించారు. అయితే వైసీపీ ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెం.20తో మరింత ఇబ్బందిగా మారింది. 14 ఏళ్లలోపు క్రీడాకారులకు ఒక రేటు, 14 ఏళ్లు పైబడిన వారికి ఒక రేటు నిర్ణయించి ఆయా ధరల పట్టికను డీఎస్ఏకు పంపించారు. ప్రభుత్వం మారినా నేటికీ ఈ జీఓ కొనసాగుతుండటంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు.

కావలిలో ఇలా..

కావలిలో మినీస్టేడియం నిర్మాణానికి 2001లో ఉదయగిరి రోడ్డు వద్ద 9 ఎకరాల స్థలాన్ని అప్పటి టీడీపీ ప్రభుత్వం కేటాయించింది. 2014-19 మధ్య టీడీపీ హయాంలో రూ.2కోట్లు నిధులు కేటాయించి పనులు ప్రారంభించారు. అయితే అప్పటి వైసీపీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి బేస్‌మెంట్ పూర్తయ్యాక మైదానం మధ్యలో భవనం నిర్మిస్తున్నారని పనులు ఆపించారు. ఆ తర్వాత వైసీపీ పాలన వచ్చి మళ్లీ ఎమ్మెల్యేగా ప్రతాప్‌రెడ్డే గెలిచినా పనులు మాత్రం జరగలేదు.

\- కావలి





నెల్లూరు రూరల్ మండలం మొగళ్లపాళెంలో పూర్తయిన ఇండోర్ స్టేడియం

నేడు జాతీయ క్రీడా దినోత్సవం

ప్రపంచ క్రీడా జగతిలో దేశ ప్రతిష్ఠను సగర్వంగా నిలిపి హాకీ మాంత్రికుడిగా కీర్తి గడించిన ఆటగాడు మేజర్ ధ్యాన్‌చంద్. ఆయన జన్మదినం సందర్భంగా దేశవ్యాప్తంగా ఏటా ఆగస్టు 29వ తేదీన జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహిస్తారు. ఇందులో భాగంగానే జిల్లాలో గురువారం క్రీడా సంబరాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది దేశ ప్రధాని నరేంద్రమోదీ ఫిట్ ఇండియా మూమెంట్ పేరుతో ఢిల్లీలో ప్రతిజ్ఞ చేయనున్నారు.

ప్రతిభా పురస్కారాల ప్రదానం

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డులను అందిస్తున్నట్లు డీఈఓ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యాశాఖ 2023-24 విద్యా సంవత్సరానికి నెల్లూరులోని బీవీనగర్ కేఎన్‌ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల, కోవూరు డివిజన్ పాటూరు జడ్పీ ఉన్నత పాఠశాల, నగరంలోని బీవీఎస్ నగరపాలక ఉన్నత పాఠశాల, కోవూరు జడ్పీ బాలికోన్నత పాఠశాల, పొదలకూరు మండలం మహ్మదాపురం జడ్పీ ఉన్నత పాఠశాలను క్రీడా అవార్డులకు ఎంపిక చేసినట్లు తెలిపారు. నగరంలోని దర్గామిట్ట జడ్పీ బాలికోన్నత పాఠశాలలో గురువారం జరిగే కార్యక్రమంలో క్రీడా ప్రతిభా పురస్కారాలు అందచేస్తామన్నారు.

\- నెల్లూరు (విద్య)

ఆసక్తిగా క్రీడాదినోత్సవ పోటీలు



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

నెల్లూరు (విద్య) : జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నగరం లోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రీడాపోటీలు ఆసక్తిగా జరుగు తున్నాయి. ఈ సందర్భంగా బుధవారం ఫుట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్, త్రోబాల్, యోగా, జంప్‌రోప్, లెమన్ అండ్ స్పూన్, లగోరి అండ్ లంగాడి, సాకొరేస్ పోటీలు జరిగాయి. గురువారం ఉదయం 7 గంటలకు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నుంచి కరెంటాఫీస్ మీదుగా తిరిగి ఏసీ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఆర్‌కె.యతిరాజ్ తెలిపారు.

వినాయక నిమజ్జన వేడుకలను సమష్టిగా నిర్వహించండి

- 11న నగరంలో శోభాయాత్ర
- విస్తృత ఏర్పాట్లు చేయాలని జేసీ ఆదేశం

నెల్లూరు (సాంస్కృతికం) : వినాయక చవితి సందర్భంగా 11న జరిగే సామూహిక గణేష్ ప్రతిమల నిమజ్జన వేడుకలను నిర్వాహకులు, అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జేసీ కె.కార్తీక్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఆయన సమావేశమై మాట్లాడారు. 7వ తేదీన వినాయక చవితి పండుగ రోజు నుంచే ఘాట్ల వద్ద గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. గణేష్ మండపం నిర్వాహకులు 5వతేదీలోగా అనుమతులు తీసుకోవాలని కోరారు. 11న శోభాయాత్ర నగరంలో 8 మార్గాల్లో జరుగుతుందని, ఆ మార్గాల్లో చెట్లు, విద్యుత్ తీగలు తొలగించాలని, ఘాట్‌ల వద్ద విద్యుత్ అంతరాయం రాకుండా చూడాలని ఆదేశించారు. కాగా, గణనాథుల నిమజ్జనానికి ఇరుకళల పరమేశ్వరి ఆలయం వద్ద గణేష్ ఘాట్, రంగనాయకులపేట పెన్నా ఘాట్‌లలో ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్పొరేషన్ అదనపు కమిషనర్ నర్మదా మాట్లాడుతూ ఈ రెండు ఘాట్ల వద్ద రూ.1.6 కోట్లతో సివిల్ వర్కులు చేస్తున్నట్లు తెలిపారు. ఇరుకళల గణేష్ ఘాట్‌ను 6జోన్లు, పెన్నా ఘాట్ 5జోన్‌లుగా విభజించి నిత్యం పారిశుధ్య కార్యక్రమలు చేపట్టుతున్నట్లు ఈఈ చంద్రయ్య తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు సౌజన్య, శ్రీనివాసులురెడ్డి, డీఆర్‌ఓ లవన్న, విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, విక్రమ సింహపురి గణేష్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



గణేష్ నిమజ్జనంపై అధికారులతో సమీక్షిస్తున్న జేసీ కార్తీక్



తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా కిషోర్ కుమార్ గీసిన చిత్రం,



తోట కిషోర్ కుమార్

ఆకట్టుకున్న సందేశాత్మక చిత్రం

ఆగస్టు 29న(నేడు) తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా చేజర్ల జడ్పీ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ మాస్టరు గీసిన సందేశాత్మక చిత్రం అందరినీ అకట్టుకుంది. కొంతకాలంగా చేజర్లలో డ్రాయింగ్ మాస్టరుగా పనిచేస్తున్న తోట కిషోర్‌కుమార్ విద్యార్థుల్లో చిత్రకళలో నైపుణ్యం పెంచుతూ తాను కూడా పలు చిత్రాల ప్రదర్శన నిర్వహించే వాడు. ఈ క్రమంలో ఆయన తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గీసిన చిత్ర మిది. ఇది పలువురిని అకట్టుకుంది.

- చేజర్ల



అక్షర రూపంలో విద్యార్థుల ప్రదర్శన

అమ్మ భాషకు వందనం

తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి(గురువారం) సందర్భంగా అనంతసాగరం మండలం చిలకల మర్రి ఉన్నత పాఠశాలలో బుధవారం వేడుకలు నిర్వహించారు. ఈసందర్భగా విద్యార్థులు అఆ అక్షర రూపంలో ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, మదీనా కృష్ణారెడ్డి, మాధవి తదితరులు పాల్గొన్నారు. ఆగస్టు 29న (నేడు) తెలుగు భాషా దినోత్సవాన్ని కూడా నిర్వహించుకుంటారు.

- అనంతసాగరం

మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి

- మెప్మా పీడీ రవీంద్ర

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 28 : మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని మెప్మా పీడీ రవీంద్ర అన్నారు. వికసిత్ ఆంధ్ర-2047లో భాగంగా మెప్మా పీడీ కార్యాలయంలో బుధవారం పొదుపు మహిళలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మహిళల జీవనోపాధుల అభివృద్ధి, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు మార్కెట్ సదుపా యాలు, గ్రూపుల ఏర్పాటు, సంఘ సభ్యులకు డిజిటల్, ఆర్థిక నిబద్ధత తదితరాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐబీ అంకయ్య, ఎల్‌హెచ్ సుధాకర్, బీఎల్ సురేంద్ర, ఎస్ఎస్ కాంతయ్య, హెచ్ఎస్ హర్షిత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల వెలికితీతలో
ఎందుకంత దోబూచులాట!

- కావలిలో రియల్టర్లు 123 ఎకరాల ఆక్రమణ
- సర్వే నెంబర్లతోసహా వెల్లడించిన టీడీపీ నాయకులు
- ఆ వివరాలు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే కూడా లేఖ
- ఎటూ తేల్చని రెవెన్యూ యంత్రాంగం
- బదిలీల సాకుతో కాలయాపన

కావలి, ఆగస్టు 28 : కావలిలో రియల్టర్ల ఆక్రమణలో ఉన్న లేఅవుట్ల లోని ప్రభుత్వ భూములు వెలికి తీసేందుకు అధికారులు దోబూచు లాడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే లేఅవుట్లలో ఉన్న ప్రభుత్వ భూములను వెలికి తీయడం కోసం సర్వే బృందాలను ఏర్పాటు చేసినా పూర్తిగా ఆక్రమణలను వెలికి తీయలేదనే ఆరోపణలు ఉన్నాయి. లేఅవుట్లలో 123 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని టీడీపీ నాయకులు సర్వే నెంబర్ల వారీగా వెల్లడించారు. అయితే, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి లేఅవుట్లలో ప్రభుత్వ భూములు లేవని, ఒకవేళ ఉంటే ప్రభుత్వం స్వాధీనం చేసుకునేం దుకు సహకరిస్తానని చెబుతు న్నారు. ఈ మేరకు కావలి ఆర్డీవో శీనానాయక్‌కు రాసినట్లు ఆయనే స్వయంగా చెప్పారు. అయితే, ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూముల వివరాలు ఇవ్వకుండా కావలి మున్సిపల్ కమిషనర్‌కు సదరు లేఖను పంపించారు. ఆ లెటర్ చూసిన మున్సిపల్ యంత్రాంగం రెవెన్యూ అధికారులు ఇవ్వాల్సిన వివరాలను తమను అడగటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇలా అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ ఆక్రమణలు బయటకు తీయకుండా కాలయాపన చేస్తున్నారు.

రెండోసారి సర్వేకు ఆదేశాలు

రియల్టర్లు ఆక్రమించిన ప్రభుత్వ భూములలో రెండో విడత సర్వేకు ఆర్డీవో శీనా నాయక్ ఆదేశించారు. తొలివిడతగా కేవలం జలవనరులశాఖకు సంబంధించిన భూములను మాత్రమే గుర్తించి వాటికి మార్కింగ్ చేశారు. మార్కింగ్ చేసిన భూములను స్వాధీనం పరుచుకుని వాటి చుట్టూ కంచె ఏర్పాటుకు జలవనరుల శాఖ వద్ద నిధులు లేవని చెప్పటంతో కొన్ని రోజులు మున్సిపాలిటీ, మరికొన్ని రోజులు ఎమ్మెల్యే క్రిష్టారెడ్డి ఎక్సకవేటర్లను పంపించారు. ఇదిలాఉండగా రియల్టర్లు ఆక్రమించిన అసైన్డ్, ఇతర ప్రభుత్వ భూములను కూడా గుర్తించి వాటిని మార్కింగ్ చేయమని కావలి ఆర్డీవో శీనానాయక్ సర్వేయర్లకు, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అయితే ఆ సర్వే ఇంకా ప్రారంభించకుండా అధికారులు ఎవరికి వారు తప్పుకుంటున్నారు. ప్రస్తుతం బదిలీలు జరుగుతుండటంతో తాము ఉంటామో లేక బదిలీపై వెళతామో తేలిన తర్వాత ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను వెలికి తీయటంపై దృష్టి పెట్టాలని భావిస్తున్నారు. అయితే ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాత్రం ప్రస్తుతం ఉన్న అధికారులకే ఆక్రమణలు, అక్రమాల వివరాలు తెలుసునని వారి చేతనే వాటిని బయటకు తీయించాలని ఒత్తిడి చేస్తు న్నారు. ఈ నేపథ్యంలో ఆక్రమణలను ప్రస్తుత అధికారులు బయటకు తీస్తారా లేక బదిలీల ప్రక్రియ తేలేవరకు కాలయాపన చేస్తారా అనేది చర్చనీయాంశంగా ఉంది.



తుమ్మలపెంట రోడ్డులో ఉన్న అక్రమ లేఅవుట్

అవినీతికి కాదేదీ అనర్హం.. అన్నట్లు తయారైంది నెల్లూరు రూరల్ మండలం అల్లీపురంలోని వివాదాస్పద లేఅవుట్ పరిస్థితి. ఇప్పటి వరకూ దాదాపు రూ.75 కోట్లు విలువైన కాలువలనే ఆక్రమించారని అంతా అనుకున్నారు. కానీ లేఅవుట్ వేసేందుకు అవసరమైన నాలా కన్వర్షన్‌లోనూ భారీ అవినీతే జరిగినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. రూ.3.11 కోట్ల ప్రభుత్వ ఫీజును ఎగనామం పెట్టినట్లు రికార్డులు చెబుతున్నాయి.

ప్రభుత్వ సొమ్ము
దోచిపెట్టారు!

- 'అల్లీపురం' లేఅవుట్‌లో మరో అక్రమ వ్యవహారం
- నాలా కన్వర్షన్ వ్యాల్యూ తగ్గించి టోకరా
- ఎకరా విలువ రూ.1.45 కోట్లు.. కానీ చూపింది రూ.20 లక్షలు
- కట్టాల్సిన నాలా ఫీజు రూ.3.62 కోట్లు.. కట్టింది రూ.51 లక్షలు
- ప్రభుత్వ ఖజానాకు రూ.3.11 కోట్ల నష్టం
- అన్ని వేళ్లూ ఆర్డీవో వైపే.. జేసీ నివేదికలోనూ స్పష్టం

నెల్లూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ అల్లీపురంలోని అక్రమ లేఅవుట్ వ్యవహారంపై నాటి కలెక్టర్‌పైనే అవినీతి ఆరోపణలు రావడం, రైతులు హైకోర్టును ఆశ్రయించడంతో విచారణ జరిగింది. 6.30 ఎకరాల కాలువ స్థలం ఆక్రమించారని, నాలా కన్వర్షన్, నుడా అనుమతులు లేకుండా లేఅవుట్ వేశారని విచారణలో తేలింది. దీంతో సదరు లేఅవుట్‌కు నాలా కన్వర్షన్ చేయించడంతోపాటు వంద శాతం పెనాల్టీ విధించాలని నెల్లూరు ఆర్డీవోను కలెక్టర్ ఆదేశించారు. అలానే నుడా అనుమతుల ఫీజులు వసూలు చేయడంతో పాటు వంద శాతం పెనాల్టీలు విధించాలని నుడా వీసీని ఆదేశించారు. ఈ క్రమంలో నెల్లూరు ఆర్డీవో 24.91 ఎకరాలకు కన్వర్షన్ చేశారు. ఈ భూము లకు ఎకరా విలువ రూ.20లక్షలుగా లెక్కగట్టి నాలా ఫీజు చెల్లించారు. అయితే వాస్తవానికి 2022, ఆగస్టులో సదరు భూమి ప్రభుత్వ విలువ ఎకరం రూ.1.45 కోట్లు గా ఉంది. అంటే ఒక్కో ఎకరం విలువ రూ.1.25 కోట్లు తగ్గించి చూపించి నాలా కన్వర్షన్ చేశారు. రిజిస్ట్రేషన్ శాఖ లెక్కల ప్రకారం 24.91 ఎకరాల విలువ రూ.36 కోట్లకు పైగా ఉంది. అందులో నాలా కన్వర్షన్ ఫీజు ఐదు శాతం అంటే సుమారు రూ.1.81 కోట్లు చెల్లించాలి. అందుకు వంద శాతం పెనాల్టీగా మరో రూ.1.81 కోట్లు చెల్లించాలి. ఈ లెక్కన రూ.3.62 కోట్లు చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.51 లక్షలు మాత్రమే చెల్లించారు. అంటే రూ.3.11 కోట్లు ప్రభుత్వానికి ఎగనామం పెట్టారు. ఈ అనధికార లేఅవు ట్‌పై ఫిర్యాదుల నేపథ్యంలో పూర్వపు జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ విచారణ జరిపారు. అందులో ఈ నాలా కన్వర్షన్ ఫీజు తగ్గించి ప్రభు త్వాన్ని మోసం చేయ డాన్ని కూడా ప్రస్తావిం చారు. ఇందుకు ఆర్డీవోను బాధ్యుడిని చేస్తూ జేసీ ప్రభుత్వానికి పంపిన నివేదిక తాజాగా వెలుగులోకి వచ్చింది.

కన్వర్షన్ విధానంపైనా అనుమానాలు

అసలు ఈ వివాదాస్పద భూములకు కన్వర్షన్ చేసిన విధానం కూడా అనేక అనుమానాలకు తావిస్తోంది. నిబంధనలన్నీ పక్కన పెట్టి రూరల్ తహసీల్దార్ రిపోర్టు లేకుండానే ఆర్డీవో కన్వర్షన్ చేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. కన్వర్షన్ వ్యవహారంపై లోతుగా విచారణ జరపా ల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నాడు జాయింట్ కలెక్టర్ పంపిన నివేదికను ప్రభుత్వ స్థాయిలో తొక్కిపెట్టారు. ఆ రిపోర్టును బయటకు తీస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

కట్టించాల్సి ఉంటే కట్టిస్తాం

అల్లీపురం లేఅవుట్‌లో నాలా కన్వర్షన్‌ను కలెక్టర్ ఆదేశాల ప్రకారం చేశాం. వంద శాతం పెనాల్టీతో వసూలు చేశాం. నేను బాధ్యతలు తీసుకున్న మొదట్లోనే ఇది జరిగింది. వాల్యూ ఏమైనా తక్కువగా ఉండి ఇంకా ఫీజు కట్టించాల్సి ఉంటే కట్టిస్తాం.

- ఏ మాలోల, నెల్లూరు ఆర్డీవో

నాడు ఎకరం విలువ రూ.1.45 కోట్లు

అల్లీపురంలోని కొన్ని సర్వే నంబర్లలో ఉన్న భూమి విలువ 2022 ఆగస్టులో ఎకరం రూ.1.45 కోట్లుగా ఉంది. ఈ భూమి నాలా కన్వర్షన్ అయ్యా క గజం విలువ రూ.7 వేలుగా మారింది.

- మిల్కీరోషన్, నెల్లూరు ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్

ఆలయానికి వెళ్లి వచ్చేలోగా దోచేశారు!

- పట్టపగలు తాళం వేసిన ఇంట్లో చోరీ
- 16 సవర్ల బంగారం అపహరణ
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ, సీఐ



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటరమణ

కావలి రూరల్, ఆగస్టు 28: పట్టపగలు ఇంటికి తాళం వేసి ఆలయానికి వెళ్లి వచ్చేలోగా దోచేసిన ఘటన బుధవారం కావలి పట్టణం ముసునూరులో జరిగింది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. ముసునూరు ఆంధ్రాబ్యాంక్ సమీపంలో విద్యుత్ శాఖ లైన్‌మ్యాన్ పులిమి వేణుగోపాల్‌రెడ్డి కుటుంబం నివశిస్తుంది. వేణుగోపాల్ రెడ్డి కలిగిరి మండలం అయ్యపరెడ్డిపాలెంకు డ్యూటీకి వెళ్లగా ఆయన భార్య మధుస్మిత ఉదయం 9గంటలకు ఇంటికి, బయట గేటుకు తాళం వేసి సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లింది. పూజల అనంతరం 10గంటలకు తిరిగి ఇంటికి వచ్చి గేటుకు వేసిన తాళం తీసి మెయిన్ డోర్ వద్దకు వెళ్లగా తాళం పగలగొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బెడ్ రూంలోని బీరువా తాళాలు తీసి అందులోని వస్తువులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. బీరువాలో పరిశీలించగా 16 సవర్ల బంగారు ఆభరణాలు అపహ రించుకెళ్లినట్లు గుర్తించి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ వెంకరమణ పరిశీలించగా నెల్లూరు డాగ్ స్క్వాడ్‌తో పాటు క్లూస్ టీం సభ్యులు వేలిముద్రలు స్వీకరించారు. సీఐ జీ.రాజేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేర నియంత్రణ పట్ల అవగాహన ఉండాలి

నేర నియంత్రణ పట్ల ప్రజలు అవగాన కలిగి ఉండాలని డీఎస్పీ వెంకటరమణ పేర్కొన్నారు. కావలి పట్టణం ముసునూరులో బుధవారం నేర నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ రాజేశ్వరరావు, స్థానిక నాయకుడు బొట్లగుంట శ్రీహరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రెండు వ్యాన్ల ఢీ : తప్పిన ప్రమాదం



వ్యాన్‌తోపాటు రోడ్డుపై పడిన టమోటా ట్రేలు

సంగం, ఆగస్టు 28: మండలంలోని వెంగారెడ్డి పాళెం సమీపంలో ముంబయి జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి నెల్లూరు వైపు వెళ్తున్న రెండు మినీ వ్యాన్‌లు ఢీకొని బోల్తా పడ్డాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్లు సురక్షితంగా బయట పడ్డారు. పోలీసుల కథనం మేరకు, కడప జిల్లా బద్వేలు నుంచి నెల్లూరుకు మినీ ట్రక్కు టమోటా ట్రేలతో వెళ్తుండగా, వెనుకనే వస్తున్న కూరగాయల మినీ వ్యాను దాన్ని క్రాస్ చేయిబోయి ఢీకొట్టింది. దీంతో టమోటాల ట్రక్కు రోడ్డు పక్కనే బోల్తా పడింది. టమోటాలు చెల్లాచెదురయ్యాయి. ఢీకొట్టిన వాహనం అదుపుతప్పి కుడివైపు రహదారి కిందకు దిగి పంట కాలువలో బోల్తా పడింది. ఆ సమయంలో ఎదురుగా వాహనాలు రాకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో ఇద్దరు డ్రైవర్లు ఊపిరి పీల్చుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కండలేరు కాలువ లీకేజీ నీటితో
సోమశిల-పొదలకూరు రోడ్డుకు గండి

- వాహనాల రాకపోకలు బంద్



సోమశిల-పొదలకూరు రోడ్డుకు పడిన గండి

కలువాయి, ఆగస్టు 28 : మండలంలోని రాజుపాళెం సమీపంలోని పరమానంద ఆశ్రమం దగ్గర బుధవారం కండలేరు కాలువ లీకేజీ నీటితో సోమశిల-పొదలకూరు రోడ్డుకు గండి పడింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న వెంటనే ఎస్ఐ అయ్యప్ప అక్కడికి చేరుకుని రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు పెట్టి అటువైపు వాహనాలు వెళ్లకుండా నిలిపివేశారు. సోమశిల జలాశయం నుంచి ఇటీవల కండలేరుకు నీరు విడుదల చేశారు. పరమానంద ఆశ్రమం పైభాగంలో వెళ్తున్న కాలువ నుంచి నీరు లీకేజీ అవుతుంది. ఈ లీకేజీ నీరంతా వచ్చి పడటంతో రోడ్డుకు గండి పడింది. లీకేజీ నీరు పెన్నానదిలోని వెళ్లేందుకు రోడ్డు కింద పైపులు ఏర్పాటు చేసినా లీకేజీ ఎక్కువ కాడంతో మూడు రోజులుగా రోడ్డు కింద మట్టి కొంచెం కొంచెం కోతకు గురవుతున్నట్లు స్థానికులు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం రోడ్డుకు గండి పడింది. అప్పటి నుంచి రాకపోకలు నిలిచిపోయాయి.

కలువాయిలో క్షుద్రపూజల కలకలం



క్షుద్రపూజలు చేసిన ప్రాంతం

కలువాయి, ఆగస్టు 28 : కలువాయికి సమీపంలోని అంకమ్మ రచ్చ దగ్గర నుంచి పొలాల్లోకి వెళ్లే దారిలో ముగ్గుతో మనిషి బొమ్మ వేసి, బొమ్మ చేతులు, కాళ్లకు మేకులు కొట్టి వాటికి తెల్లధారం కట్టారు. అంతేకాక బొమ్మపై పసుపు, కుంకుమ చల్లి, టెంకాయలు కొట్టి పూజలు చేసి ఉన్నారు. దాన్ని చూసి బుధవారం ఉదయం పొలాల్లోకి వెళ్లిన రైతులు భయాందోళనలకు గురయ్యారు. ఈ వార్త కలువాయిలో కలకలం రేపింది. అక్కడ క్షుద్రపూజలు జరిగినట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	110
లేయర్ లైవ్	105
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	224
లేయర్	178

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6898
వెండి కిలో ధర	రూ. 87,600
వెండి ఒక గ్రాము	రూ. 90.60

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

వింజమూరు, ఆగస్టు 28 : మండలంలోని శంఖవరం వద్ద బుధవారం ట్రాక్టర్ అదుపు తప్పి ద్విచక్ర వాహనదారుడిని ఢీకొనగా, ఓ యువకుడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు, గుండెమడకల గ్రామానికి చెందిన వేములపాటి మహేష్ (29) ఎర్రబల్లి గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళుతుండగా, శంఖవరం నుంచి వింజమూరుకి కర్రల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ అదుపు తప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో మహేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్ ట్రాలీ బోల్తాపడింది. డ్రైవర్ పరారయ్యారు. మృతుడు మహేష్‌కు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. మహేష్ మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధితురాలికి
కొత్త వాహనం ఇవ్వండి

- ఈవీ స్కూటర్ డీలర్‌కు వినియోగదారుల కోర్టు ఆదేశం

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 28 : బాధితురాలికి అమ్మిన లోపభూయిష్టమైన ఎలక్ట్రిక్ స్కూటర్‌ను వెనక్కి తీసుకుని లోపాలు లేని కొత్త వాహనాన్ని ఇవ్వాలంటూ బుధవారం ఉమ్మడి నెల్లూరు జిల్లా వినియోగదారుల కోర్టు న్యాయమూర్తి జింకారెడ్డి శేఖర్ ప్యూర్ ఎనర్జీ కంపెనీని ఆదేశించారు. లోపాలను సరిదిద్దడానికి ప్యూర్ ఎనర్జీ యాజమాన్యం, డీలర్ ఎటువంటి చర్యలు తీసుకోకపోవటంపై మండిపడ్డారు. అన్యాయమైన వాణిజ్య పద్ధతులను మానుకోవాలని హెచ్చరించారు. వివరాలు ఇలా ఉన్నాయి... నెల్లూరుకు చెందిన లావణ్య 2021 సెప్టెంబరు 9న ప్లూటో 7జీ మోడల్ ఎలక్ట్రిక్ స్కూటర్ ను నెల్లూరులోని ప్యూర్ ఎనర్జీ కంపెనీ డీలర్ వద్ద రూ.84 వేలకు కొనుగోలు చేశారు. స్కూటర్‌పై మూడేళ్ల వారెంటీని పొందారు. కొనుగోలు చేసిన ఏడు రోజులకే వాహనంలో సమస్యలు వచ్చాయి. డీలర్ సమస్యలను తాత్కాలికంగా పరిష్కరించినా ఫలితం లేకపోయింది. పైగా వారంటీలో ఉన్న స్కూటర్‌కు ఉచిత సర్వీసు చేయకుండా బాధితురాలి నుంచి సర్వీసు చార్జీ వసూలు చేశారు. 2023లో సమస్యలు మరింత పెద్దవయ్యాయి. దీంతో బాధితురాలు జిల్లా వినియో గదారుల కోర్టును ఆశ్రయించింది. కేసును విచారించిన న్యా యమూర్తి జింకారెడ్డి శేఖర్ స్కూటర్ లోపభూయిష్టతయా రీని గుర్తించారు. ఆ వాహనాన్ని వెనక్కి తీసుకుని బాధితు రాలికి 30 రోజుల్లోగా లోపాలు లేని కొత్త వాహనాన్ని వారంటీతో ఇవ్వాలంటూ తీర్పు ఇచ్చారు. కోర్టు ఖర్చుల నిమిత్తం రూ.3వేల చెల్లించాలని ఆదేశించారు.

ఎంతమంది శిశువులను దత్తత ఇచ్చారు?

- అధికారులను ప్రశ్నించిన కలెక్టర్



ఐసీడీఎస్ అధికారులను ప్రశ్నిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 28 : మహిళా శిశు సంక్షేమ శాఖ శిశు గృహం నుంచి ఇంత వరకు ఎంత మంది శిశువులను దత్తత ఇచ్చారని కలెక్టర్ ఆనంద్ ఆ శాఖ అధికారులను ప్రశ్నించారు. శిశు గృహం శిశువులు, అనాథల గురించి కలెక్టర్ తన చాంబర్‌లో ఐసీడీఎస్ అధికారులతో బుధవారం సమీక్షించారు. ఇంకా ఎంత మం దిని దత్తత ఇవ్వాలని ప్రశ్నించారు. దీనికి సంబంధించి ఆన్‌లైన్ విధానంలో ఇబ్బందులు ఉన్నాయా అని అడిగారు. ఎన్జీవోల ద్వారా నిర్వహిస్తున్న అనాథ శరణాలయాల్లో బాల ల దత్తతపై ఆరా తీశారు. కొత్తగా గుర్తించిన 15 మంది బాలల దత్తత ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ బీ హేనాసుజన్, టీ మాధవి, డీసీపీవో బీ సురేష్, సీడబ్ల్యూసీ సభ్యులు ఎం నిహారిక, రాజ్యలక్ష్మి, ఐసీపీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలుసుకుందాం.. కాపాడుకుందాం

- కేన్సర్‌పై కరపత్రిక ఆవిష్కరించిన కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 28 : కేన్సర్ గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ ఆనంద్ అన్నారు. బుధవారం పీహెచ్‌పీ నాయకులు మర్యాద పూర్వకంగా కలెక్టర్‌ను కలిశారు. కేన్సర్‌పై అవగాహనకు రూపొందించిన కరపత్రాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు కేన్సర్ వ్యాధిపై అవగాహన కలిగించాలని కోరారు. పీహెచ్‌పీ, ఆర్ఎంపీలు చికెన్‌గున్యా, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా తదితర వ్యాధులకు ప్రాథమిక వైద్య సేవలు అందిస్తూ ఆయా వ్యాధులపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. రోగులను దగ్గరలోని ప్రభుత్వ పీహెచ్‌సీలు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, సరసాపురం ప్రసాద్, ఉప్పలపాటి రామదాసు, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో 34.419 టీఎంసీల నీరు నిల్వ

అనంత సాగరం, ఆగస్టు 28: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి బుధవారం 13,905 క్యూసెక్కులు ప్రవాహం వస్తుంది. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 34.419 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 3000, డెల్టా, ఉత్తర, దక్షిణ కాలువలకు 210 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు,(క్రైం), ఆగస్టు 28: నెల్లూరులోని వేదాయపాళెం రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ జీ మాలకొండయ్య ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. 50 నుంచి 55 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడు. మృతదేహంపై పసుపు రంగు ఫుల్ హ్యాండ్ షర్ట్, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ఉన్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఇద్దరు ఎస్ఐల బదిలీ

నెల్లూరు,(క్రైం), ఆగస్టు 28: జిల్లాలో ఇద్దరు ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ జీ కృష్ణకాంత్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కలువాయి పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏ అయ్యప్పను నెల్లూరులోని చిన్నబజారు స్టేషన్‌కు, వీఆర్‌లో ఉన్న కే సుమన్‌ను కలువాయి స్టేషన్‌కు బదిలీ చేశారు.

పగలు రెక్కీ.. రాత్రి చోరీలు !

- దొంగలను పట్టుకుని పోలీసులకు అప్పగింత

తోటపల్లిగూడూరు, ఆగస్టు 28 : మండలంలోని మాచర్లవారిపాలెంలో రెండు రోజుల నుంచి మోటార్లు చోరీకి గురవుతోన్నాయి. మంగళవారం మధ్యాహ్నం చిత్తు కాగితాలు ఏరుకుంటూ నటిస్తూ ఉండగా అనుమానాస్పదంగా ఉండడంతో గ్రామస్థులు వారిని హెచ్చరించి పంపి వేశారు. అదేరోజు రాత్రి 12గంటల సమయంలో అదే వ్యక్తులు చోరీలకు పాల్పడుతుండడంతో చూసిన రొయ్యల గుంటల కాపలాదారులు గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన గ్రామస్థులు చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను, ఒక ఆటో, ఒక మోటారు, బైక్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గత రాత్రి నెలిమట్ల కండ్రిగలో బైకు చోరీకి గురైంది. దీనిపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వీరేంద్ర బాబు బుధవారం తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

పొదలకూరు, ఆగస్టు 28 : కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని భోగసముద్రంలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గత కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఉన్నాయని, ఇంట్లో భర్తలేని సమయంలో భార్య ప్రసన్న ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ హనీఫ్ తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని స్కూటరిస్టు దుర్మరణం

- మరొకరికి గాయాలు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వరరావు

రాపూరు, ఆగస్టు 28 : రాపూరు నుంచి చిట్వేలుకి వెళ్లే ఘాట్ రోడ్డులోని ఐదవ కిలోమీటర్ వద్ద బుధవారం ఓ కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న వెంకటాచలం మండలం పొలిచెర్ల పాడుకు చెందిన వెంకటరత్నయ్య (50) అక్కడికక్కడే మృతి చెందాడు. కారులోని వ్యక్తికి స్వల్ప గాయాల య్యాయి. పోలీసుల కథనం మేరకు, వెంకటరత్నయ్య స్కూటర్‌పై చిట్వేలికి పెళ్లికి వెళుతుండగా, చిట్వేలి నుంచి వస్తున్న కారు ఢీకొంది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను రాపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సీఐ టీ విజయకృష్ణ, ఇన్‌చార్జి ఎస్ఐ వెంకటేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కారులోని వారి వివరాలు తెలియరాలేదు.

అనంతసాగరం కేంద్రంగా రేషన్ బియ్యం రాకెట్

● యథేచ్ఛగా అక్రమ వ్యాపారం ● పట్టించుకోని అధికారులు

అనంతసాగరం, ఆగస్టు 28: పేదలకు అందించే రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు చేరుతున్నాయి. మండలంలోని వెంగంపల్లికి చెందిన కొందరు అక్రమ వ్యాపారానికి ఆజ్యం పోస్తున్నా పట్టించుకొనే నాథుడు లేడు. ప్రతి నెలా ఒకటవ తేదీ నుంచి 15 వరకు ఎండీయూ వాహనాల ద్వారా బియ్యం పంపిణీ చేస్తారు. అనంతరం మాఫియా సభ్యులు రంగంలోకి దిగుతారు. ప్రతి గ్రామంలోనూ లబ్ధిదారుల నుంచి కేజీ రూ. 10 వంతున కొనుగోలు చేస్తారు. ఆ బియ్యాన్ని ఒక రహస్య ప్రాంతంలో నిల్వ చేసి నెలలో రెండు సార్లు అనుమానం రాకుండా ట్రాలీ ఆటోల ద్వారా నెల్లూరు, బుచ్చిలోని రైస్ మిల్లులకు తరలిస్తారు. అక్కడ బియ్యాని పాలిష్ పట్టి బహిరంగ మార్కెట్‌లో కేజీ రూ.25 నుంచి రూ . 35లకు అమ్ముతారు. కొన్ని సందర్భాల్లో ఆ బియాన్ని చెన్నైకి తరలిస్తారు. రేషన్ బియ్యం రాకెట్ వైసీపీ హయాం నుంచి జరుగుతుంది. ప్రభుత్వం మారినా స్థానిక అధికారుల్లో చలనం లేదు. గతంలో ఆటోతో సహా రేషన్ బియ్యాన్ని స్థానిక అధికారులు పట్టుకొన్నారు గానీ, సరైన చర్యలు చేపట్టలేదు. దీంతో ఈ అక్రమ వ్యాపారం విచ్చలవిడిగా సాగుతోంది. అధికారులు మామూళ్లకు అలవాటు పడి పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రెండు రోజుల క్రితం సంగం వద్ద పోలీసులు రేషన్‌బియ్యంతో వెళ్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. ఇది అనంతసాగరానికి కావడం గమనార్హం.



సంగం పోలీసులు పట్టుకొన్న రేషన్ బియ్యం వాహనం (ఫైల్)

బదిలీపై వచ్చిన సీఐ, ఎస్ఐల బాధ్యతల స్వీకరణ






ఎస్ఐలుగా బాధ్యతలు చేపట్టిన మర్రిపాడులో శ్రీనివాస్, వింజమూరులో వీరప్రతాప్, ఏఎస్ పేటలో సైదులు, సంగంలో సీఐ వేమారెడ్డిని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

సంగం, ఆగస్టు 28: సర్కిల్‌లో బాధ్యతలు స్వీకరించిన సీఐ వేమారెడ్డిని టీడీపీ నేతలు బుధవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, బాణా శ్రీనివాసులురెడ్డి, పిట్టు పట్టాభిరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ పేట : ఎస్ఐగా బుధవారం ఏ సైదులు బాధ్యతలు స్వీకరించారు.నెల్లూరు వన్ టౌన్ ఎస్ఐగా పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకి వచ్చారు. ముందుగా ఆయన నాయబ్‌రసూల్ దర్గాను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.అనంతరం బాధ్యతలు చేపట్టారు. సమస్యల పరిష్కారనికి కృషి చేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

మర్రిపాడు: ఎస్ఐగా కె.శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో బాగంగా ఆయన నెల్లూరు వీఆర్ నుంచి మర్రిపాడుకి వచ్చారు. మండలంలోని టీడీపీ నాయకులు యువత ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు.

వింజమూరు : ఎస్ఐగా కె.వీరప్రతాప్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలను కాపాడతానని, అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతానని తెలిపారు.



ఉదయగిరి ఎస్ఐని సన్మానిస్తున్న టీడీపీ నేతలు

ఎస్ఐకి ఘన సన్మానం

ఉదయగిరి రూరల్ : విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనపరిచి స్వాతంత్ర్యం దినోత్సవం సందర్భంగా మంత్రి పొంగూరు నారాయణ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డిని బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సన్మానించారు. మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సందిరెడ్డి రామారావు, గానుగపెంట ఓబులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

అనంతసాగరం : స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆత్మకూరు సీఐ గంగాదర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణాష్టమి వేడుకల ముగింపు



శ్రీకృష్ణుడి గ్రామోత్సవం

వింజమూరు, ఆగస్టు 28 : మండలంలోని శంఖవరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం ముగిశాయి. చివరిరోజు స్వామివారిని కృష్ణావతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు జరిపించారు. శ్రీకృష్ణుని జననం గురించి వివరించారు. అనంతరం స్వామివారిని పల్లకీపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచి తాటిబోయిన మాల్యాద్రి, భోగిరెడ్డి వెంకటరమణారెడ్డి, భోగిరెడ్డి మాలకొండరెడ్డి, చింతనబోయిన మాల్యాద్రి, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్) : దుత్తలూరు సెంటర్‌లో త్రైత సిద్ధాంతం వారి ఆధ్వర్యంలో మూడోరోజైన బుధవారం భక్తులు శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామివారికి విశేష అలంకరణలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామంతోపాటు పరిసర గ్రామాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

వాహనాల రుసుం వసూలుకు నేడు వేలంపాట

ఏఎస్ పేట,ఆగస్టు28: స్థానిక ఖాజా నయాబ్‌రసూల్ దర్గాకు వచ్చే ప్రైవేటు వాహనదారుల నుంచి రుసుము వసూలు చేయడానికి గురువారం వేలంపాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి యస్థాని ఓ ప్రకటనలో తెలిపారు. దర్గా గంధమహోత్సవం సందర్భంగా 2024 సెప్టెంబరు ఒకటి నుంచి 2024 సెప్టెంబరు 30వతేదీ వరకు (30 రోజులు) వాహనదారుల నుంచి రుసుము వసూలు చేసుకోడానికి స్థానిక సచివాలయంలో గురువారం ఉదయం 11గంటలకు వేలం పాట నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా రూ.10వేలు చెల్లించాలని తెలిపారు.ఇతర వివరాలకు తనను సంప్రదించాలన్నారు.

వైఎస్ఆర్ విగ్రహం చుట్టూ అరుగు తొలగింపుపై ఫిర్యాదు

మర్రిపాడు : స్థానిక వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం చుట్టూ ఉన్న అరుగును తొలగించారని ఎక్స్‌కవేటర్ ఆపరేటర్ దుద్దుగుంట శ్రీనివాసులురెడ్డిపై వైసీపీ నాయకులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మర్రిపాడులోని మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఇంటి ముందు వైఎస్ఆర్ విగ్రహం ఉంది. ఆప్రాంతంలో చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబం గురువారం వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించేదుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో పక్కనే ఉన్న వైఎస్ఆర్ విగ్రహం చుట్టూ అరుగు దగ్గర ఉన్న మెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. ఉద్దేశపూర్వకంగా ఆ మెట్లను తొలగించారని వైసీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చోరీలు, నేరాల నియంత్రణపై అవగాహన

సంగం : సమాజంలో జరిగే చోరీలు, నేరాలపై మండలంలోని జెండాదిబ్బలో సీఐ వేమారెడ్డి గ్రామస్థులకు బుధవారం సాయంత్రం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లు అనుమానం వస్తే సమాచారం అందించాలన్నారు. ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లేటప్పుడు ఇంట్లో విలువైన బంగారు నగలు, నగదు ఉంచకుండా బ్యాంకు లాకర్ లేక వెంట తీసుకెళ్లాలన్నారు. చిన్న చిన్న విషయాలకు గొడవలు పెట్టుకుని చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగార్జునరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

వైభవంగా బాలాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠించిన బాలాంజనేయస్వామి విగ్రహం

సంగం, ఆగస్టు 28: మండలంలోని దువ్వూరులో నిర్మించిన ఆలయంలో బాలాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణల మధ్య బాలాంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం కుంభాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

దాతల చేయూత మరువలేనిది : ఎంఈవో-2

ఉదయగిరి రూరల్, ఆ గస్టు 28: ప్రభుత్వ పాఠశా లల అభివృద్ధికి దాతలు అందిస్తున్న చేయూత మరువలే నిదని ఎంఈవో-2 తోట శ్రీని వాసులు పేర్కొన్నారు. బుధ వారం మండలంలోని బిజ్జం పల్లి జడ్పీ ఉన్నత పాఠశాల లో స్టేజీ, ముఖద్వారం ఏర్పా టుకు దాతలతో కలిసి భూ మి పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడు తూ స్టేజీ నిర్మాణానికి మూలె రాజశేఖర్‌రెడ్డి, ముట్టుకుందు ప్రభాకర్‌రెడ్డి, ముఖద్వారం నిర్మా ణానికి కల్లూరి సిద్ధారెడ్డి జ్ఞాపకార్థం రవీంద్రరెడ్డిలు ముందుకు రావడం అభినంద నీయమన్నారు. ఈ సందర్భంగా శుభదిన్‌భోజన్ కార్యక్రమంలో భాగంగా మూలె రాజశేఖర్‌రెడ్డి, ప్రత్యూషల వివాహం సందర్భంగా విద్యార్థులకు అతిథి భోజనం అందించారు. కాగా మం డలంలోని గడ్డంవారిపల్లి జడ్పీ ఉన్నత, గన్నేపల్లి ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న స్వీయ మదింపు పరీక్షలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం. నాయబ్, మాలకొండయ్య, సర్పంచి లక్కు. రమణమ్మ, ఎస్ఎంసీ చైర్మన్ కవిత, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జట్‌ఫట్ బీబీ గంధోత్సవం



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న భక్తులు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 28: ఉదయగిరి దుర్గంపై బుధవారం పర్యాటకుల సందడి నెలకొంది. మొహర్రం మాసంలో వచ్చే చివరి బుధవారం(అఖర్ ఛాస్ముంబా) రోజున ముస్లింలు కుటుంబ సమేతంగా వనభోజనాలకు వెళ్లి పచ్చికబయళ్లు తొక్కితే, పాపాలు హరించి, పుణ్యం లభిస్తుందని వారి విశ్వాసం. అందులో భాగంగా దుర్గంపై పట్టణంతోపాటు వింజమూరు, పామూరు, నెల్లూరు, బద్వేల్, కావలి, ఆత్మకూరు తదితర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు అధికసంఖ్యలో తరలి వచ్చి తొట్టి, లొద్ది ప్రాంతంలో సేదతీరారు. సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం దుర్గంపై గల పురాతన కట్టడాలను తిలకించారు. అలాగే దుర్గంపై గల జట్‌ఫట్‌బీబీ దర్గాలో గంధ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, ఫకీరు జరుబులు, బాణసంచా పేలుళ్ల నడుమ గంధాన్ని హక్కుదారుల ఇంటి నుంచి ఊరేగింపుగా దర్గాకు చేర్చారు. చదివింపుల అనంతరం గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా దర్గాలో భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఎన్నికల నిధుల వినియోగంపై విచారణ



నివేదికలు స్వీకరిస్తున్న డీఎల్పీవో కృష్ణమోహన్

వరికుంటపాడు, ఆగస్టు 28: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు నిధుల వినియోగంపై బుధవారం కందుకూరు డీఎల్పీవో కృష్ణమోహన్ విచారణ చేపట్టారు. అప్పట్లో తమకు నిధులు ఇవ్వకుండా ఎంపీడీవో వెంకటకృష్ణకు మారి అక్రమాలకు పాల్పడ్డారని బీఎల్‌వోగా విధులు నిర్వర్తించిన రామాపురం పంచాయతీ కార్యదర్శి ప్రభుదాస్ ఆర్వోకి ఫిర్యాదు చేశారు. అదే సమయంలో ఎంపీడీవో సైతం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో కార్యదర్శిని సస్పెండ్ చేశారు. దీంతో తనకు న్యాయం చేయాలని కోరుతూ ఆ కార్యదర్శి ఇటీవల కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ నేపథ్యంతో ఎంపీడీవో, తహసీల్దారు కార్యాలయాల్లో బీఎల్‌వోలుగా విధులు నిర్వర్తించిన ఉద్యోగులను డీఎల్పీవో విచారించి, నివేదికలు సేకరించారు. కాగా సేకరించిన నివేదికలను ఉన్నతాధికారులకు అందచేస్తామని డీఎల్పీవో తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

బిట్రగుంట, ఆగస్టు 28: బోగోలు మండలంలో బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి సీవీవీ సత్యం అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంపై బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల మహిళ అధ్యక్షురాలు ఎన్.రాజ్యలక్ష్మి, పార్టీ నేతలు మల్లికార్జున, అభిరామ్, జంపాని ప్రసాద్, కొండూరు పోలయ్య, వేణునాయుడు, సముద్రాల వెంకటేశ్వర్లు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కాపు సంఘం నియోజకవర్గ మహిళా కన్వీనర్‌గా మద్దెల ఉష

కందుకూరు, ఆగస్టు 28: కందుకూరు నియోజకవర్గ కాపు సంఘం మహిళా కన్వీనర్‌గా మద్దెల ఉష నియమించినట్లు సంఘం రాష్ట్ర, జాతీయ నాయకులు తోట లక్ష్మీనారాయణ, మల్లెల శివనాగేశ్వరరావులు తెలిపారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

రామలింగేశ్వర ఆలయంలో అంకురార్పణ

బిట్రగుంట: బోగోలు మండలం రామస్వామిపాలెంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం అంకురార్పణ జరిగింది. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచన కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు బత్తుల రవిచంద్ర పాల్గొన్నారు.

కావలి సమగ్రాభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

● పాతూరులో సీసీ రోడ్లకు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, ఆగస్టు 28: కావలి సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని పాతూరు 5, 7 వార్డులలో రూ.9.5 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5వ వార్డు రామిరెడ్డి వారి వీధిలో రూ.4.5 కోట్లతో, 7వ వార్డు కాటావారి వీధిలో రూ.5 కోట్లు ఎంపీ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. కావలిలో ఇటీవల రూ.70 లక్షలతో కాలువల్లో పూడిక తీసి, రోడ్లకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగింపచేశామన్నారు. అన్ని వార్డుల్లో అవసరమైన చోట సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మాణాల కోసం రూ.10 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని, నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామన్నారు. అమృత్ పథకం నిధులు రూ.62 కోట్లతో నిర్మిస్తున్న మంచినీటి సరఫరా ప్రాజెక్ట్ పనులు పూర్తి చేసి త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం చేయనున్నట్లు తెలిపారు. ట్రంకు రోడ్డు విస్తరణ పనులు సైతం ప్రారంభమయ్యాయని త్వరలో పూర్తి చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోతుగంటి అలేఖ్య, చిలకపాటి శ్రీనివాసులు, సురేష్, జనిగర్ల మనోహర్, బొంతా శ్రీనివాసులు, తిరువీది ప్రసాద్, రమణయ్య పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే

కావలి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అమరావతిలో బుధవారం సాయంత్రం కలిసి చేపట్టాల్సిన పనులను వివరించారు. త్వరలో కావలికి రావాలని కోరారు. దామవరం ఎయిర్‌పోర్టు నిర్మాణ విషయాలను సీఎంతో చర్చిం చి అభివృద్ధికి సహకరిస్తున్న సీఎంకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు మెరుగైన వైద్యం ప్రభుత్వ లక్ష్యం : ఇంటూరి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

వలేటివారిపాలెం, ఆగస్టు 28 : పేదలకు సకాలంలో మెరుగైన వైద్యం అందిచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. వలేటివారిపాలెం పీహెచ్‌సీలో నేషనల్ హెల్త్ మిషన్ పథకం కింద మంజూరైన రూ.50 లక్షలతో నిర్మించనున్న ల్యాబ్ భవనానికి టుబాకో బోర్డు వైస్ చైర్మన్ గుత్తా వాసుబాబుతో కలిసి బుధవారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భగా ఆసుపత్రిలోని అన్ని విభాగాలతోపాటు పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ పరీక్షలకు గ్రామీణ ప్రాంత ప్రజలు దూరప్రాంతాల్లోని పట్టణాలకు వెళ్లేందుకు ఆర్థిక ఇబ్బందులతో పడుతున్న అవస్థలను దృషిలో పెట్టుకొని వలేటివారిపాలెంలో అన్ని రకాల రక్తపరీక్షలు నిర్వహించేందుకు అనుగుణంగా ల్యాబ్ భవనం ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు. ల్యాబ్‌కు వసరమైన అన్ని పరికరాలు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు వైద్యం అందక పడిన ఇబ్బందులు అందరికీ తెలుసన్నారు. అర్హత కలిగిగన బాధితులకు సీఎం సహాయ నిధిని మంజూరు చేస్తునట్లు తెలిపారు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.15 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, కాంట్రాక్టర్ వలేటి నరసింహం, వైద్యులు మణిదీపిక, శ్రీనివాసరావు, శివప్ప, ఎంపీడీవో శేషుబాబు, తహసీల్దారు అబ్దుల్‌అమీర్, ఆర్ అండ్‌బీ డీఈ మస్తాన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు టీడీపీ కార్యాలయంలో చీరాల ఎమ్మెల్యే

కందుకూరు, ఆగస్టు 28 : చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య బుధవారం సాయంత్రం కందుకూరులోని టీడీపీ కార్యాలయానికి విచ్చేశారు. కందుకూరు ప్రాంత వాసి కొండయ్య కందుకూరుకు రావటంతో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సాదరంగా ఆహ్వానించారు. వారివెంట పలువురు స్థానిక టీడీపీ నాయకులు, యాదవసంఘం నాయకులు ఉన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

లింగసముద్రం, ఆగస్టు 28 : మండలంలోని వీఆర్ కోట గ్రామ సమీపంలోని మన్నేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ఐదు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. వివరాల మేరకు.. గుడ్లూరు సీఐ ఎం మంగారావుకు అందిన సమాచారం మేరకు ఆయన లింగసముద్రం ఎస్సై ఎం బాజీబాబు, సిబ్బందితో కలసి మంగళవారం అర్ధరాత్రి 11 గంటల సమయంలో వీఆర్ కోట గ్రామ శివారులో దాడులు నిర్వహించారు. ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని, డ్రైవర్లను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసులు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. కాగా పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్లలో రెండు ట్రాక్టర్లు తనవని, వాటిని విడిచి పెట్టాలని వలేటివారిపాలెంకు చెందిన ఓ టీడీపీ నాయకుడు ఎస్సై బాజీబాబును కోరగా ఎస్సై చలానాలు కట్టి తీసుకెళ్లాలని చెప్పడంతో వారి మధ్య వాగ్వాదం జరిగినట్టు తెలిసింది.

అడవి పందిని ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు

వలేటివారిపాలెం, ఆగస్టు 28 : మోటారుబైకుపై వెళ్తున్న ఓ యువకుడు షడన్‌గా రోడ్డుపైకి వచ్చిన అడివిపందిని ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన వలేటివారిపాలెంలోని తూమలేరు సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగింది. మండలంలోని అయ్యవారిపల్లెకు చెందిన ముచ్చు సుబ్బారావు వలేటివారిపాలెంలోని కిరాణా దుకాణంలో పని చేస్తాడు. అక్కడ పని ముగించుకొని తిరిగి అయ్యవారిపల్లెకు మోటారుబైకుపై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో సుబ్బారావుకు తల పగిలి తీవ్ర గాయాలయ్యాయి. అడవిపంది అక్కడికక్కడే మృతి చెందింది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కందుకూరుకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు, అక్కడి నుంచి గుంటూరుకు తరలించారు.

అసభ్యకరంగా తిడుతున్నాడని ఫిర్యాదు

కావలి రూరల్, ఆగస్టు 28: కావలి పట్టణం వైకుంఠపురంకు చెందిన ఓ మహిళను శ్రీకాంత్ అనే వ్యక్తి అసభ్యకరంగా తిడుతున్నాడని బుధవారం 1వ పట్టణ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల మేరకు.. ఆమె తన భర్తతో పనిచేసే శ్రీకాంత్ అనే వ్యక్తితో గతంలో సన్నిహితంగా ఉండేది. 5 నెలలుగా దూరం పెట్టడంతో ఆమె కనిపించినప్పుడు ఆ వ్యక్తి అసభ్యంగా దూషించే వాడు. మంగళవారం ఆమె భర్తతో కలసి మోటారు సైకిల్‌పై వెళ్తుండగా మానస థియేటర్ వద్ద శ్రీకాంత్ మోటారు సైకిల్‌కు ఎదురు వచ్చి బండిని కాలుతో తన్ని అసభ్యంగా తిట్టాడని ఫిర్యాదు చేసింది. ఎస్ఐ జమాల్‌వలి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

కొండాపురం, ఆగస్టు 28: పాఠశాలలో విద్యార్థుల వివరాలు, తదితర రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఎంఈవో-2 ఆనందరావు అన్నారు. కొండాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అలాగే స్కూల్ అసెస్‌మెంటు మోడల్‌పేపర్-1 పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఎఫ్ఏ-1 పరీక్షల స్థానంలో శాంప్-1 పరీరిక్షలను అదే విధానంలో ప్రభుత్వం నిర్వహిస్తుందని, దీనిపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

మధ్యాహ్న భోజనానికి బియ్యం వితరణ

బిట్రగుంట, ఆగస్టు 28: బోగోలు మండలం తిప్ప ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం టీడీపీ నేత బోగిరి ప్రభాకర్ తన తల్లి బోగిరి మన్నెమ్మ జ్ఞాపకార్థం ఐదు బియ్యం బ్యాగులను ప్రిన్సిపాల్ విజయలక్ష్మికి బుధవారం అందచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, బీజేపీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, కావ్యా యువసేన సభ్యులు గోచిపాతల సంజయ్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

లింగసముద్రం, ఆగస్టు 28 : ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పెన్నా కృష్ణయ్య చెప్పారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్ను వసూలు చేసి పంచాయతీల ఆదాయం పెంచాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ టి ప్రసాద్, ఎంపీడీఓ కె శ్రీనివాసులు, ఈఓపీఆర్డీ కెవి రామసుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానం అమలు చేయాలి

బిట్రగుంట, ఆగస్టు 28: టీడీపీ ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని సీఐటీయు మండల కార్యదర్శి చల్లా నరహరి, వ్యవసాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తాలూరి మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు తుమ్మల శీనయ్య, నాయకులు షేక్.బాదుల్లా, పూండ్ల తిరుపతి, కనుమూరి క్రిష్ణయ్య, ఏ.బ్రహ్మయ్య, షబీర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల సంరక్షణకు హైడ్రా చట్టం తేవాలి

కావలి, ఆగస్టు 28: కావలి డివిజన్‌లో ఆక్రమణలకు గురవుతున్న చెరువులను సంరక్షించేందుకు హైద్రాబాద్‌లాగా హైడ్రా చట్టాన్ని మన రాష్ట్రంలో కూడా తీసుకు రావాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేసి ఆర్డీవో శీనానాయక్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నేతలు సాదు ప్రసాద్, శ్రీనివాసులు, జరుగుమల్లి దయాకర్, నారుబోయిన లక్ష్మినర్సు, జరుగుమల్లి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయంలో మాజీ సీఎం జగన్ ఫొటో



గోడకు తగిలించిన జగన్ ఫొటో

బిట్రగుంట, ఆగస్టు 28: బోగోలు పంచాయతీ వార్డు సభ్యుల సమావేశానికి బుధవారం వచ్చిన ఇద్దరు వార్డు సభ్యులు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోను తీసుకువచ్చి వదంటున్నా విధులకు ఆటంకం కలిగిస్తూ గోడకు తగిలించారని పంచాయతీ కార్యదర్శి జహీర్ తెలిపారు. ఈ మేరకు ఫొటో తగిలించిన 4వ వార్డు సభ్యుడు సూరపనేని శ్రీనివాసులు, 7వ వార్డు సభ్యుడు గంగపట్ల సన్నపమ్మలపై ఎస్సై బోజ్యకు ఆయన ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి ద ర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు పట్టాలపై మృతదేహం

బిట్రగుంట, ఆగస్టు 28: బిట్రగుంట రైల్వే స్టేషన్ దక్షణం వైపు రైలు పట్టాలపై రాధానాథ్ బిందాని (57) మృతదేహం పడి ఉన్నట్లు కావలి జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన వివరాల మేరకు ఒడిశాకు చెందిన రాధానాథ్ బిందాని అతని భార్య అలమణి బిందాని భువనేశ్వర్ నుంచి చెన్నైకి బుధవారం రైలులో వెళుతున్నారు. రైలు నెల్లూరు స్టేషన్ చేరుకున్నా భర్త రాకపోవడంతో అనుమానంతో భార్య రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో బిట్రగుంట స్టేషన్ దాటిన తరువాత ప్రమాదవశాత్తు రైల్లో నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్పీ పోలీసులు ఆమెకు తెలిపారు. సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని ఆమె తన భర్తదిగా గుర్తించారు. దీంతో మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించి శవపంచనామా చేసి బంధువులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు

కావలి రూరల్, ఆగస్టు 28: అదనపు కట్నం కోసం అత్తింటి వారు వేధిస్తున్నారని కావలి పట్టణం మేదరబజార్‌కు చెందిన షాజీలా బుధవారం 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. షాజీలాకు నెల్లూరుకు చెందిన మొహిద్‌తో 2021లో వివాహం జరిగింది. వారికి పుట్టిన పాప కలర్ నలుపు ఉందన్న కారణంగా షాజీలాపై అనుమానాలు వ్యక్తం చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతోపాటు అదనపు కట్నం కోసం అత్త పర్వీన్, మామ మహబూబ్ బాషా, ఆడబిడ్డ గౌషియా వేధిస్తున్నారని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ జమాల్‌వలి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎడమ కాలువకు నీరు వదిలిన ఎమ్మెల్యే సోమిరెడ్డి

పొదలకూరు, ఆగస్టు 28 : రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన వ్యవసాయం, ఇరిగేషన్ శాఖలను ప్రక్షాళన చేస్తున్నామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కండలేరు లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్ల స్విచ్ ఆన్ చేసి ఎడమ కాలువకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కండలేరు ఎడమ కాలువ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను 2014లో టీడీపీ ప్రభుత్వం రూ.61కోట్లతో చేపట్టగా 2017 నుంచి 2019 వరకు 3.2 టీఎంసీల నీరు విడుదల చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం కండలేరు లిఫ్ట్ ఇరిగేషన్‌కు కనీసం కరెంటు బిల్లులు కట్టలేక మూలపడేసిందన్నారు. అప్పటి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అంబటి రాంబాబు, వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిలు రైతులను సాగు, తాగునీటికి ఇబ్బందులకు గురిచేశారన్నారు. అప్పటిలో కండలేరు నీటి కోసం ఆరు గ్రామాల రైతులు ధర్నా చేసినా పట్టించుకోలేదన్నారు. కాకాణి హయాంలో వ్యవసాయ శాఖ పూర్తిగా మూత పడిందన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే కరువు వస్తుందని చెప్పుకొచ్చిన వారు, ఇప్పుడు జలాశయాలు ఒక్కొక్కటిగా నిండుతుండడంతో వారికి నిద్రపట్టడంలేదన్నారు. మండలంలో ఇగిపోయిన దక్షిణ కాలువ, దేగపూడి - బండేపల్లి కాలువ పనులు పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. కాకాణి జనం కోసం కాకుండా ధనం కోసం బతికారన్నారు. కండలేరు ఎడమ కాలువకు నీరు వదలడంతో పొదలకూరు, చేజర్ల, సైదాపురం, మనుబోలు, వెంకటాచలం, నెల్లూరు రూరల్, మండలాల్లోని 20,400 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ ఎస్ఈ వెంకటరమణారెడ్డి, కండలేరు డ్యాం ఈఈ పీ.విజయభాస్కర్‌రెడ్డి, కండలేరు లిఫ్ట్ ఈఈ ఎం.అనిల్‌కుమార్‌రెడ్డి, డీఈఈ విజయరామిరెడ్డి, టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, నువ్వుల వెంకట్, కోడూరు పెంచలభాస్కర్ రెడ్డి, అక్కెం సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్ల స్విచ్చాన్ చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

ఎస్పీ స్టేషన్ల తనిఖీ



బుచ్చి పోలీస్‌స్టేషన్‌లో కృష్ణకాంత్

బుచ్చిరెడ్డిపాళెం : కోవూరు నియోజకవర్గంలోని విడవలూరు, కొడవలూరు, బుచ్చి పోలీసుస్టేషన్లను బుధవారం ఎస్పీ కృష్ణకాంత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుచ్చి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీ నేరుగా ఇన్‌స్పెక్టర్ గదిలోకి వెళ్లారు. సీఐ శ్రీనివాసులురెడ్డి లేకపోవడంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిజిస్టర్‌ను తెప్పించుకుని పరిశీలించారు. సిబ్బందిని పలు విషయాలపై వివరాలడిగి తెలుసుకున్నారు.

● **నేరుగా సమాచారమివ్వండి**

బుచ్చి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏవైనా సమస్యలుంటే నేరుగా తన నెంబరుకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని విలేకరులతో ఎస్పీ అన్నారు. బుచ్చిలో రౌడీయిజం, చోరీలు, మద్యం, గంజాయి, మందుబాబుల ఆగడాలు, పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత గురించి విలేకరులు ఆయన దృష్టికి తీసుకురాగా ఆయన పైవిధంగా స్పందించారు.

● **కొడవలూరు :** పోలీసుస్టేషన్ ఎస్పీ కృష్ణ కాంత్ తనిఖీ చేసి, పెండింగ్ కేసుల గురించి తెలుసుకుని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఆయన వెంట సీఐ సురేంద్ర తదితరులు ఉన్నారు.

● **విడవలూరు :** పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ తనిఖీ చేసి కేసుల రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్ఐ సాయి ప్రసాద్‌కి సూచించారు. అయన వెంట కొడవలూరు సీఐ సురేంద్ర తదితరులు ఉన్నారు.

ఎస్ఐగా బాధ్యతల స్వీకరణ

తోటపల్లిగూడూరు, ఆగస్టు 28 : ఇందుకూరుపేట నుంచి బదిలీపై వచ్చిన ఎస్ఐ జి.వీరేంద్రబాబు బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారిపైనైనా చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెడతామని, గ్రామాల్లో అల్లర్లు చేస్తే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

మనుబోలు ఎస్ఐగా రాకేష్..

మనుబోలు : మనుబోలు ఎస్ఐగా నియమితులైన ఎంఎస్ రాకేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన్ను పలువురు టీడీపీ నాయకులు కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ తెలుగుయువత ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు సాని వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

31న చౌకిచర్ల చెరువు వేలం

విడవలూరు : మత్స్య శాఖ ఆధీనంలో ఉన్న చౌకిచర్ల చెరువులో చేపల పెంపకానికి ఈ నెల 31న వేలం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎఫ్‌డీవో శ్రీనివాసులు, గ్రామ మత్స్య సహాయకుడు నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మత్స్యశాఖ జేడీ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు వేలం నిర్వహిస్తామన్నారు. పాల్గొనేవారు రూ. 5వేలు ధరావత్తు చెల్లించాలన్నారు.

ఆక్రమణను అడ్డుకున్న కమిషనర్

బుచ్చిరెడ్డిపాళెం : రామకృష్ణానగర్‌లో పంచాయతీ స్థలాన్ని ఆక్రమించి, నిర్మిస్తున్న కట్టడాన్ని కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం సిబ్బందితో వెళ్లి అడ్డుకున్నారు. నగర పంచాయతీలో కబ్జాదారులు ఆక్రమించిన స్థలాలను స్వచ్ఛందంగా వదిలివేయకుంటే చర్యలు తప్పవన్నారు. అనుమతులు లేకుండా కట్టడాలు చేపడితే కూల్చివేస్తామని హెచ్చరించారు. అనంతరం బేస్‌మట్టాలతో ఆగిన నగర పంచాయతీ కార్యాలయాన్ని కమిషనర్ పరిశీలించారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సహకారంతో నగర పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణ పనులు చేపడతామన్నారు.

తెలుగు భాషను కాపాడుకోవాలి

వెంకటాచలం, ఆగస్టు 28 : తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో బుధవారం భారతీయ జ్ఞాన వ్యవస్థ అనే అంశంపై రెండురోజుల జాతీయ సదస్సులో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, తెలుగుశాఖాధిపతి డాక్టర్ ఎం త్యాగరాజు పాల్గొన్నారు.

● **కళాశాలల తనిఖీ**

విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలను బుధవారం వీఎస్‌యూ వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా వీఆర్ న్యాయ కళాశాల, చంద్రారెడ్డి డిగ్రీ కళాశాలలోని మౌలిక వసతులు, ఉపాధ్యాయుల పనితీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

ప్రతీ బూత్ నుంచి సభ్యులను నమోదు చేయాలి

బుచ్చిరెడ్డిపాళెం,ఆగస్టు28: బుచ్చి మున్సిపాలిటీ పరిధిలోని ప్రతీ బూత్ నుంచి 200మందిని బీజేపీ సభ్యులుగా చేర్చుకోవాలని ఆ పార్టీ నేతలు నిర్ణయించారు. బుధవారం స్థానిక ఆర్‌బీఆర్ హైయర్స్‌లో బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు రామిశెట్టి మోహన్‌బాబు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఇండ్ల రాఘవేంద్రరావు, కాసా శ్రీనివాసులు, రమణమ్మ, పలువురు బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌పై వైఎస్సార్ ఫొటో

● టీడీపీ నేతల అభ్యంతరంతో వివాదం

● ఎంపీడీవో కార్యాలయం ఎదుట దాత, కాంగ్రెస్ నేతల ఆందోళన



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మనుబోలు, ఆగస్టు 28: మండలంలోని అక్కంపేటలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ దాత రాజన్న జలధార పేరుతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌పై దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫొటో ఉండడంపై టీడీపీ నేతలు అభ్యంతరం తెలిపారు. దీంతో అటు టీడీపీ, ఇటు కాంగ్రెస్ పార్టీ నేతల మధ్య వివాదం రాజుకుంది. గత కొద్ది రోజులుగా జరుగుతున్న ఈ వివాదం ఎట్టకేలకు బుధవారం మండల పరిషత్ కార్యాలయానికి చేరింది. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కిరణ్‌కుమార్‌రెడ్డి దాతృత్వంతో ఏడేళ్లుగా రాజన్న జలధార పేరుతో వాటర్‌ప్లాంట్ నిర్వహిస్తున్నాడు. దీనిపై కొద్ది రోజుల క్రితం టీడీపీ, కాంగ్రెస్ నాయకులకు వివాదం తలెత్తింది. దీంతో అధికారులు ప్లాంట్‌ను మూసివేశారు. దీనిపై కిరణ్‌కుమార్‌రెడ్డి కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడడంతో ఆయన కోర్టు నుంచి పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. కొత్తగా పంచాయతీ తీర్మానం చేయించి పంచాయతీ అధికారులకు పంపారు. దీంతో బుధవారం వాటర్‌ప్లాంట్‌ను పునఃప్రారంభించారు. అయితే అక్కడ ఏర్పాటు చేసిన బోర్డులో వైఎస్ఆర్ ఫొటో ఉండడాన్ని గ్రామ టీడీపీ నాయకులు తప్పుబట్టారు. దాత పేరు, దాత ఫొటో ఉండాలే తప్ప రాజకీయ నాయకుల ఫొటో ఎందుకని ప్రశ్నించారు. దీంతో మరోసారి వివాదం చెలరేగింది. ఈ నేపథ్యంలో ఇటు కాంగ్రెస్, అటు టీడీపీ నాయకులు మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు. ఇరుపార్టీల నాయకులను సర్దుబాటు చేసేందుకు అధికారుల ప్రయత్నాలు విఫలమయ్యాయి. వివాదాలు జరగకుండా పోలీసులు ప్రవేశించారు. వైఎస్ఆర్ ఫొటో తీసేందుకు వీలులేదని, న్యాయపోరాటం కోసం ఎంత దూరమైనా వెళతానంటూ కిరణ్‌కుమార్‌రెడ్డి నాయకులతో కలసి ఆందోళనకు దిగారు. ప్రస్తుతం శాంతిభద్రతల దృష్ట్యా పంచాయతీకి నోటీసు ఇచ్చి ఫ్లెక్సీని తీయించి ప్రజలకు నీరు అందిస్తామని, తదుపరి ఉన్నతాధికారుల ఆదేశాల తరువాత ఫొటో ఉంచాలా, వద్దా అన్నది నిర్ణయిస్తామని ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ విషయంలో గ్రామంలో ఎలాంటి అల్లర్లు జరగకుండా పికెట్ ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ రాంబాబు తెలిపారు.

బుచ్చి నగర పంచాయతీ కమిషనర్‌గా చంద్రశేఖర్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం,ఆగస్టు28: బుచ్చి నగరపంచాయతీ కమిషనర్‌గా లింగారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా పొదిలి మున్సిపల్ కమిషనర్‌గా వెళ్ళిన ఆయన తిరిగి బుధవారం బుచ్చి కమిషనర్‌గా విధుల్లోకి వచ్చారు. ముందుగా కార్యాలయ సిబ్బంది, కార్మికులు ఆయనకు స్వాగతం పలికారు. పలువురు కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు, ప్రభాకర్‌రెడ్డి, కొండయ్య, శ్రీనివాసులు, కాంట్రాక్టర్ వీవీ శేషయ్య, వైసీపీ నాయకులు,ఇతర అధికారులు కమిషనర్‌ను కలిసి శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కాగా చైర్‌పర్సన్ మోర్ల సుప్రజను చంద్రశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.



కమిషనర్‌ను సన్మానించిన గ్రీన్ అంబాసిడర్లు

గురుకుల పాఠశాలలో ఎంపీ వీపీఆర్

కొడవలూరు ఆగస్టు 28 : మండలంలోని చంద్రశేఖర పురంలో ఉన్న ఏకలవ్య గిరిజన గురుకుల పాఠశాలను బుధవారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని వంటగది, తరగతి గదులను, ఇతర మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా ఉత్తర భారతదేశ అధ్యాపకులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాఠశాలను అన్నివిధాలా అభివృద్ధి చేస్తామన్నారు. చిన్నారులకు ఉన్నత విద్యను అందించేలా సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. ఆయన వెంట అధికారులు, మండల పరిశీలకుడు మూంగమూరి శ్రీహరిరెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, చెక్కామదన్, పీ ప్రసాద్‌రెడ్డి, బోర్ల సతీష్‌నాయుడు, వినీల్‌రెడ్డి , తదితరులు ఉన్నారు.



విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

అక్రమ లేఅవుట్లపై ఉక్కుపాదం

● హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

రాపూరు, ఆగస్టు 28 : రాపూరు పంచాయతీ పరిధిలోని మల్లమ్మగుంట, మద్దెలమడుగు, వెలుగోను మార్గంలో వెలిసి ఉన్న నాలుగు అక్రమ లేఅవుట్లలో నుడా అధికారుల ఆదేశాల మేరకు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది బుధవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. మలమ్మగుంటలోని సర్వే నెంబరు 1104/1సీ, మద్దెలమడుగు-గూడూరు మార్గంలోని సర్వే నెంబరు 1054లోని స్థలాల్లో నుడా అనుమతి లేకుండా ప్లాట్లు వేశారని అధికారులు తెలిపారు. వీటిని ఎవరైనా కొనుగోలు చేస్తే చట్ట విరుద్ధమని హెచ్చరించారు. రిజిస్ట్రేషన్లు, భవన నిర్మాణాలను తమ అనుమతి పొందేవరకు చేయకూడదని పేర్కొన్నారు. డీపీవో, నుడా వైస్ చైర్మన్ ఆదేశాల మేరకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. అనుమతులు లేవని బోర్డులు ఏర్పాటు చేస్తే అధికారులను బెదిరిస్తున్నారని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండు, మూడు సచివాలయ కార్యదర్శులు అశోక్, పావని, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

రాపూరు, ఆగస్టు 28 : రాపూరు మండల ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ -257 కార్యవర్గాన్ని బుధవారం జిల్లా నాయకుల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పీవీ నర్సారెడ్డి, అధ్యక్షులుగా నాగేంద్రకుమార్‌ను ఎన్నికున్నారు. ఉపాధ్యాయులు ఎస్ఆర్‌లను అప్డేట్ చేయాలని, సీపీఎస్ జీపీఎం యూపీఎస్‌ల రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని, జీవో నెంబరు -117 రద్దు చేయాలని వారు కోరారు.

రెండు లారీల ఢీ

బుచ్చిరెడ్డిపాళెం,ఆగస్టు28: స్థానిక టీఎన్ఆర్ కల్యాణమండపం సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న ధాన్యంలారీని బుధవారం వేకువన వెనుకవైపు నుంచి వచ్చిన బొగ్గు లారీ ఢీకొంది. ఈ ఘటనలో బొగ్గులారీ ముందుభాగం నుజ్జునుజ్జుకాగా, డ్రైవర్‌కు ప్రమాదం తప్పింది.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

యువతి చెవిపై గడ్డ

● విజయవంతంగా తొలగించిన జీజీహెచ్ వైద్యులు

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 28 : నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 18 ఏళ్ల యువతికి అరుదైన శస్త్రచికిత్స జరిగింది. బుధవారం చెవి,ముక్కు,గొంతు వైద్య నిపుణుడు డాక్టర్ సుకుమార్ జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఇందుకూరుపేట మండలం కొమరిక గ్రామానికి చెందిన ఉప్పల కృప(18) అనే యువతి చెవిపై కొంతకాలంగా పెద్ద గడ్డ పెరిగి ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. ఆమె ఇటీవల జీజీహెచ్‌కు రావడంతో పరీక్షించి శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించామన్నారు. ఆ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తిచేసి గడ్డను తొలగించామని చెప్పారు. ఆపరేషన్‌లో ఈఎన్‌టీ వైద్య నిపుణులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ కల్యాణి, డాక్టర్ ఆశా, మత్తు వైద్యులు డాక్టర్ శారదా, డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారని వెల్లడించారు.

పనితీరు మెరుగుపడకపోతే కష్టమే!

● విభాగాధిపతులకు కమిషనర్ హెచ్చరిక

నెల్లూరు(సిటీ), ఆగస్టు 28 : మీ పనితీరు బాగా మెరుగుపడాలి... ఇలాగైతే కష్టం... నిర్లక్ష్యం కనిపిస్తే సహించను...! 659 జీవో పక్కాగా అమలు చేయాల్సిందేనంటూ కార్పొరేషన్ కమిషనర్ మల్లవరపు సూర్యతేజ విభాగాధితపతులు, కార్యాలయంలోని సూపరింటెండెంట్లకు వార్నింగ్ ఇచ్చారు. కార్పొరేషన్‌పై తరుచూ అవినీతి ఆరోపణలు రావడం, పత్రికల్లో వరుస కథనాలు ప్రచురితమవడంపై ఆగ్రహించిన కమిషనర్ మంగళవారం వివిధ విభాగాధిపతులతో అంతర్గత సమీక్ష నిర్వహించారు. ఇది బుధవారం చర్చనీయాంశంగా మారింది. రియల్ టైం గవర్నెన్స్‌లో భాగంగా 659 జీవోను పక్కాగా అమలు చేయాలని కమిషనర్ ఆదేశించినట్లు తెలిసింది.

సంక్షేమ హాస్టళ్లను పరిరక్షించాలి : ఏఐఎస్ఎఫ్

నెల్లూరు (విద్య), ఆగస్టు 28 : సంక్షేమ హాస్టళ్లకు పెండింగ్ ఉన్న మెస్, కాస్మొటిక్ చార్జీలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి, సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న వసతిగృహాలను పరిరక్షించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. ఫెడరేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ వసతిగృహాల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ఏడేళ్లుగా ట్రంకుపెట్టెలు, దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు పూర్తిస్థాయిలో ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పవన్‌కిషోర్, నగర అధ్యక్షుడు శివం వర్మ, నాయకులు పాల్గొన్నారు.

బస్సును ఢీకొన్న టిప్పర్ డ్రైవర్‌పై కేసు

నెల్లూరు (క్రైం), ఆగస్టు 28 : నెల్లూరు నగరంలో మంగళవారం అర్ధరాత్రి పుంగనూరు డిపోకు చెందిన ఆర్టీసీ ఇంద్ర బస్సును టిప్పర్ ఢీకొన్న ఘటనపై సౌత్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎర్రమట్టి లోడుతో వెళుతున్న టిప్పర్ యూటర్న్ తీసుకుంటూ వెనుక వస్తున్న బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో నలుగురు ప్రయాణికులకు చిన్నపాటి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న సౌత్‌ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రయాణికులను సమీప వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్‌ను స్టేషన్‌కు తరలించారు. పరారీలో ఉన్న డ్రైవర్ వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేశారు.

రౌడీ షీటర్లపై ప్రత్యేక దృష్టి సారించండి : నగర డీఎస్పీ

నెల్లూరు(క్రైం), ఆగస్టు 28: నగరంలో రౌడీ షీటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలని...తోకజాడిస్తే కఠిన చర్యలు చేపట్టాలని నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి నగర పరిధిలోని ఉన్న పోలీసు స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. ఆయన కార్యాలయంలో బుధవారం ఇన్‌స్పెక్టర్లతో క్రైం సమావేశం నిర్వహించారు. రౌడీ షీటర్లు, కేడీలు, నేర ప్రవృత్తి కలిగిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. రాత్రి వేళల్లో నిరంతరం గస్తీ నిర్వహిస్తూ దొంగతనాలు అరికట్టాలన్నారు. గంజాయి, మాదకద్రవ్యాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు.

మున్సిపల్ కాంప్లెక్స్‌లో బినామీ షాపుల సీజ్

నెల్లూరు సిటీ ఆగస్టు 28 : నెల్లూరు కార్పొరేషన్‌కు సంబంధించిన షాపింగ్ కాంప్లెక్సుల్లో బినామీ పేర్లతో నిర్వహిస్తున్న షాపులను కార్పొరేషన్ రెవెన్యూ అధికారులు బుధవారం రాత్రి సీజ్ చేశారు. సేకరించిన సమాచారం మేరకు.. నగరంలోని గాంధీబొమ్మ కూడలిలో ఉన్న జేవీఆర్ కాంప్లెక్స్‌తోపాటు, సుబేదార్‌పేట, హోటల్ బసోట ఎదుట, పెద్దబజారులోని ఏసీ మున్సిపల్ కాంప్లెక్స్, ట్రైకస్‌రోడ్డులోని కాంప్లెక్స్‌లోని షాపులను ఆర్వో, ఆర్ఐలు బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో తనిఖీ చేశారు. బహిరంగ వేలం ద్వారా షాపులు పొందిన వ్యక్తులు కాకుండా బినామీ పేర్లతో వేరొకరు ఆ దుకాణాలు నిర్వహిస్తున్నట్లు తేల్చారు. బినామీలపై ఇటీవల కమిషనర్‌కు ఫిర్యాదులు అందడంతో ఈ దాడులు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కార్పొరేషన్ నుంచి దుకాణం పొందిన వారు మూడింతలు ఎక్కువ అద్దెకు బినామీలకు ఇచ్చినట్లు నిర్ధారించారు. ఈ మేరకు గుర్తించిన షాపులన్నీటిని సీజ్ చేసి నోటీసులు అందించినట్లు దాడుల్లో పాల్గొన్న ఓ అధికారి వెల్లడించారు.



షాపును సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రమాదం కేసులో ఏడాది జైలు, జరిమానా

నెల్లూరు (లీగల్), ఆగస్టు 28 : వాహనాన్ని అతివేగంగా నడిపి చిన్నారి మృతికి కారణమయ్యాడన్న కేసులో నేరం రుజువు కావడంతో మట్టా ప్రసాద్ అనే డ్రైవర్‌కు సంవత్సరం జైలు శిక్ష, రూ.6వేల జరిమానా విధిస్తూ నెల్లూరు మొదటి తరగతి స్పెషల్ రైల్వే జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పాలమంగళం వినోద్ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా వేటపాళెం గ్రామానికి చెందిన కారెంపూడి రాజా అనే వ్యక్తి తన భార్యా బిడ్డలతో కలసి కొన్నేళ్ల క్రితం నెల్లూరు జిల్లాలోని తోటపల్లి గూడూరు మండలం విలుకానిపల్లి గ్రామానికి వలస వచ్చాడు. అక్కడ చికెన్ స్టాల్ నడుపుతూ తన ఇద్దరు పిల్లలను చదివించుకుంటూ జీవిస్తూ ఉండేవారు. 2019 జనవరి 29వ తేదీ సాయంత్రం అతని పిల్లలు చికెన్ షాపు వద్ద ఆడుకుంటున్నారు. అదే సమయంలో నెల్లూరుకు చెందిన మట్టా ప్రసాద్ అనే డ్రైవర్ టాటా ఏస్ వాహనాన్ని అతివేగంగా నడుపుతూ నూడిల్స్ బండిని, రెండు బైక్‌లను ఢీకొట్టాడు. ఆడుకుంటున్న రాజా కుమార్తె కారెంపూడి లిఖిత నాగవర్షిణిని, అదే ప్రాంతానికి చెందిన గడ్డి శ్రీహరి అనే వ్యక్తిని ఢీకొట్టాడు. చిన్నారికి తీవ్ర గాయాలు కావడంతో నెల్లూరులోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. గాయపడ్డ మరో వ్యక్తి కూడా నెల్లూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందాడు. తోటపల్లి గూడూరు పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి సంవత్సరం జైలు శిక్షతోపాటు ఐదు వేల రుపాయల జరిమానా, సెక్షన్ 338 ఐపీసీ కింద 6 నెలలు జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ లీలాకుమారి వాదించారు.

ఆర్ఎస్ఆర్ఎంలో తెలుగు భాషా దినోత్సవం

నెల్లూరు (విద్య), ఆగస్టు 28 : నగరంలోని స్టోన్‌హౌస్‌పేట ఆర్ఎస్ఆర్ఎం నగరపాలక ఉన్నత పాఠశాలలో బుధవారం కొండూరు హరినారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్, ఏ ట్రస్ట్ ఏ ఫర్ ఆల్ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగుభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఏ ట్రస్ట్ అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ మాతృభాషలో ప్రావీణ్యం సాధిస్తే అన్ని భాషలను సులభంగా నేర్చుకోవచ్చన్నారు. ఈ క్రమంలో తెలుగు భాష గొప్పతనాన్ని తెలియచేస్తూ ముద్రించిన ఫొటో ప్రింట్లను బాలబాలికలకు అందచేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మధుసూదన్‌రావు, ట్రస్ట్‌ల సభ్యులు ఏ జయప్రకాష్, సింగంశెట్టి మురళి, అరవ రామ్మోహన్ రావు, ముత్యాల రవీంద్ర, బుజ్జయ్య, తోట శ్రీమంత్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతపై దృష్టి సారించాలి : ఏఎంవో సుధీర్‌బాబు

నెల్లూరు (విద్య), ఆగస్టు 28 : విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతపై దృష్టి సారించి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సమగ్రశిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుధీర్‌బాబు తెలిపారు. డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా ప్రాజెక్ట్‌లో భాగంగా దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో నెల్లూరు రూరల్ పాఠశాలల ఉపాధ్యాయులకు హ్యాండ్‌వాష్‌పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఎంవో మాట్లాడుతూ పాఠశాలల్లో డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా కార్యక్రమాలను అమలు చేయాలని సూచించారు. పలు అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎంఈవో-2 మురళీధర్, రాష్ట్ర ప్రోగ్రాం మేనేజర్ కుమారి, రీసోర్స్ పర్సన్ గోడె ప్రసాద్, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 28 : గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకుని పెన్నా రచయితల సంఘం బుధవారం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించింది. పొదలకూరు రోడ్డులోని సూర్యా స్కూల్‌లో ఈ పోటీలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వారి అభిప్రాయాలు తెలిపారు. పెన్నా రచయితల సంఘం అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి తెలుగు భాషోద్యమంలో గిడుగు రామమూర్తి పోరాట స్ఫూర్తిని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ షంషుద్దీన్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అర్చకుల వేతనం పెంపు హర్షణీయం

● రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సుధ

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 28 : ఆలయాల్లో అర్చకుల వేతనాన్ని రూ.10వేల నుంచి రూ.15 వేలకు పెంచడం, దూప దీప నైవేద్యాలకు ఇచ్చే మొత్తాన్ని రూ.5వేల నుంచి రూ.10వేలకు పెంచడం హర్షదాయకమని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ తడకపల్లి సుధ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిరుద్యోగ వేద విద్యార్థులకు నెలకు రూ.3వేలు భృతి, నాయీబ్రాహ్మణులకు కనీస వేతనం రూ.25వేలు ఉండేలా ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకున్నారన్నారు. దేవాలయాల ట్రస్ట్ బోర్డులో అదనంగా మరో ఇద్దరికి అవకాశం కల్పించడం, దేవాలయ ఆస్తుల పరిరక్షణ కోసం, ఆధ్యాత్మిక పర్యాటకాభివృద్ధి కోసం మంత్రులతో కమిటీలు ఏర్పాటు చేయడం గొప్ప విషయం అన్నారు.

గొలగమూడి ఈవో దురుసు ప్రవర్తన మార్చుకోవాలి

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 28 : గొలగమూడి భగవాన్ వెంకయ్యస్వామి ఆలయం ఈవో బాలసుబ్రహ్మణ్యంకు కోపం ఎక్కువ, భక్తులపై దురుసుగా ప్రవర్తించే గుణం ఎక్కువగా ఉందని, దానిని ఆయన మార్చుకోవాలని భగవాన్ వెంకయ్య స్వామి కుటుంబ సభ్యులు సోంపల్లి పెంచలయ్య కోరారు. స్వామివారి ఆరాధనోత్సవాలకు వచ్చిన తమ కుటుంబంతో ఈవో దురుసుగా వ్యవహరించారని ఆరోపించారు. బుధవారం జర్నలిస్టు భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గొలగమూడి ఆలయంపై తమకు ఎలాంటి దురుద్దేశంలేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో సోంపల్లి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైం),ఆగస్టు 28: ముగ్గురిపై దాడి చేసిన ఘటనలో వేదాయపాళెం పోలీసులు బుధవారం ముగ్గురిని అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని బీవీ నగర్‌లో ఉన్న ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ మేనేజర్‌గా పీటర్, ఏసీ టెక్నీషియన్‌గా శిరీష్ పనిచేస్తున్నారు. సర్వీస్ సెంటర్‌లో పనిచేసేందుకు ఒడిశాకు చెందిన జుహేంద్ర డుంబూరి, పద్మిని డుంబూరి దంపతులతోపాటు మరో వ్యక్తిని ఈ నెల 27న తీసుకువచ్చారు. వారు ఓ గదిలో ఉండగా అర్ధరాత్రి మేనేజర్, ఏసీ టెక్నీషియన్ మద్యం మత్తులో వారిపై దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్ట్ చేశామని ఇన్‌స్పెక్టర్ ఆర్ఎస్ కిశోర్‌కుమార్ తెలిపారు.

లార్వా, ఫీవర్ సర్వే

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 28 : నగరంలోని చంద్రమౌళినగర్‌లో డెంగ్యూ వ్యాధి కేసులు నమోదు కావడంతో బుధవారం వైద్యాధికారులు ఫీవర్ సర్వే చేపట్టారు. జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ ఆధ్వర్యంలో విస్తృతంగా పర్యటించి ఫీవర్ సర్వేతోపాటు లార్వా సర్వే నిర్వహించారు. స్థానిక పారిశుధ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. దోమకాటుకు గురికాకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంవో నాగార్జునరావు, జయరాం, శాంసన్‌బాబు, రామారావు, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీదర్, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి బుధ, శనివారాల్లో 'జనవాణి'

నెల్లూరు,(స్టోన్‌హౌస్‌పేట),ఆగస్టు 28: నగరంలోని గోమతి నగర్‌లో ఉన్న జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రతి బుధ, శనివారాల్లో ఉదయం 11 గంటలకు జనవాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆ పార్టీ నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ తెలిపారు. బుధవారం జనవాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రాష్ట్రంలో కూటమి ఏర్పడ్డాక పేదలకు మేలు చేసేందుకు అనేక పథకాలను, వివిధ సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందని చెప్పారు. జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గునుకుల కిషోర్ మాట్లాడుతూ ప్రజలు వారి సమస్యలను అర్జీల రూపంలో సమర్పించిన తర్వాత స్క్రీనింగ్ కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించి పరిష్కారమార్గాలను చూపే విధంగా పార్టీ పెద్దలు చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు జమీర్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీపతి రాము, సుభాషిణి, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'పై విచారణ జరిపించాలి

నెల్లూరు(హరనాథపురం): కలువాయి మండలం చిన గోపవరంలో ఉపాధిహామీ పథకం నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని కోరుతూ యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య కలెక్టర్‌కు లేఖ రాశారు. గిరిజనుల జాబ్ కార్డులలో ఇతరుల పేర్లు చేర్చి గిరిజనులకు పని కల్పించకుండా ఇతరుల పేరున డబ్బు డ్రా చేసి దుర్వినియోగం చేశారని ఆరోపించారు.

శ్రీహరి సన్నిధిలో

ఉట్లోత్సవం




తిరుమల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా తిరుమలలో బుధవారం ఉట్లోత్సవం వేడుకగా జరిగింది. శ్రీవారి ఆలయంలో గోకులాష్టమి ఆస్థానం నిర్వహించిన మరుసటి రోజు ఉట్లోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా మలయప్పస్వామి బంగారు తిరుచ్చిపై, కృష్ణస్వామి మరో తిరుచ్చిపై తిరుమాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా మలయప్పస్వామి, కృష్ణస్వామి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా పెద్దజీయర్ మఠానికి తీసుకొచ్చి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.పెద్దజీయర్ మఠం, హథీరాంజీమఠం హారతి పొంది తిరిగి ఆలయం వద్దకు వేంచేశాక శ్రీవారి ఆలయం ముందు గొల్లమండపం పక్కనే ఉట్లోత్సవం వేడుకగా జరిగింది. స్థానిక యువతతో పాటు పలువురు భక్తులు కూడా పాల్గొన్నారు.టీటీడీ జీయర్‌స్వాములు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

లక్కీడిప్‌లో శ్రీవారి అంగప్రదక్షిణ

టోకెన్లు

రూ.500 డిపాజిట్ తప్పనిసరి : టీటీడీ

తిరుమల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరవాసులతో పాటు తిరుమలవాసులకు ప్రతి శనివారం కేటాయిస్తున్న 250 శ్రీవారి ఆలయ అంగప్రదక్షిణ టోకెన్లను ఇకపై లక్కీడిప్ ద్వారా కేటాయించనున్నట్లు టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది. గతంలో రోజూ 750 టోకెన్లను తిరుమలలోనే ఆఫ్‌లైన్ ద్వారా కేటాయించేవారు. అయితే క్యూలైన్లలో భక్తుల నిరీక్షణ సమయాన్ని మరింత తగ్గించే ఉద్దేశంతో ఈ టోకెన్లను కూడా ఆన్‌లైన్ ద్వారానే కేటాయించేందుకు గత ప్రభుత్వ హయాంలో నిర్ణయం తీసుకున్నారు. అయితే కొందరు స్థానికులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించిన నేపథ్యంలో ప్రతి శనివారం 250 టోకెన్లను స్థానిక ఎమ్మెల్యేకు బదిలీ చేస్తూ వచ్చారు. ఆన్‌లైన్‌లో మిగతా రోజులకు 750 టోకెన్లు కేటాయిస్తే శనివారం 500 టోకెన్లు మాత్రమే కేటాయించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి శనివారం ఇచ్చే ఈ 250 టోకెన్లను కూడా ఆన్‌లైన్‌లోనే పెట్టాలని టీటీడీ తాత్కాలికంగా నిర్ణయం తీసుకుని గత శనివారానికి సంబంధించిన టోకెన్లను విడుదల చేశారు. ప్రస్తుతం ఈ విషయంలో టీటీడీ శాశ్వత నిర్ణయం తీసుకుంది. అంగప్రదక్షిణ టోకెన్లు కావాల్సిన భక్తులు గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తమ ఆధార్ కార్డుతో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. వీరికి సాయంత్రం 5 గంటలకు లక్కీడిప్ ద్వారా టోకెన్లు కేటాయిస్తారు. డిప్‌లో టోకెన్లు పొందిన భక్తులు వారి మొబైల్ ఫోన్లకు ఎస్‌ఎంఎస్ రూపంలో సమాచారం అందించడంతో పాటు ఆన్‌లైన్‌లో కూడా ఆ సమాచారం ఉంచుతారు. డిప్ ద్వారా టోకెన్లు పొందిన భక్తులు ఆన్‌లైన్‌లోనే రూ.500 డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. లక్కీడిప్ ద్వారా టోకెన్లు పొందిన భక్తులు తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో తమ ఆధార్ కార్డు చూపి శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అంగప్రదక్షిణ టోకెన్లు పొందాల్సి ఉంటుంది. వీరిని శనివారం వేకువజామున అంగప్రదక్షిణకు అనుమతిస్తారు. అనంతరం భక్తులు చెల్లించిన రూ.500 డిపాజిట్‌ను తిరిగి వారి ఖాతాల్లోకే టీటీడీ జమచేస్తుంది. తిరుపతి నియోజకవర్గానికి చెందని భక్తులు లక్కీడిప్‌లో అంగప్రదక్షిణ టోకెన్లు పొందితే డిపాజిట్ తిరిగి చెల్లించమని, అంగప్రదక్షిణకు అనుమతించబోమని టీటీడీ స్పష్టం చేసింది.

రాజీవ్‌నగర్ అక్రమాలపై సమగ్ర విచారణ

- 57బృందాలతో సమగ్ర సర్వే

శ్రీకాళహస్తి, ఆగస్టు 28 : శ్రీకాళహస్తిలోని రాజీవ్‌నగర్ కాలనీలో యేళ్ల తరబడి జరిగిన భూ అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టనున్నట్లు తహసీల్దారు లక్ష్మీనారాయణ తెలిపారు.2005లో పేదల కోసం ఇళ్ల స్థలాలు కేటాయించిన రాజీవ్‌నగర్‌లో గత వైసీపీ ప్రభుత్వంలో పెద్దఎత్తున ఆక్రమణలు జరిగినట్లు విమర్శలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. ఈ అంశంపై బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తాను బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి 15రోజులుగా రాజీవ్‌నగర్ కాలనీలో ఇళ్ల స్థలాలపై ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. లబ్ధిదారుల నుంచి తాము కొనుగోలు చేసిన స్థలాల్లో నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలంటూ పెద్దఎత్తున ప్రజలు కార్యాలయానికి వస్తున్నట్లు వివరించారు. అలాగే తమ పేరుతో పట్టాలున్న స్థలాల్లో ఇతరులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని కొంతమంది నుంచి ఫిర్యాదులందుతున్నాయని చెప్పారు. రోజూ తహసీల్దారు కార్యాలయానికి రాజీవ్‌నగర్ సమస్యలపైనే ప్రజలు అధికంగా రావడం జరుగుతోందన్నారు. లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించేందుకు విజిలెన్స్ శాఖ నివేదిక కోరిందని, ఈనెల 30వ తేదీన రాజీవ్‌నగర్‌లో గందరగోళ పరిస్థితులను అధ్యయనం చేసేందుకు 57 బృందాలను ఏర్పాటు చేసి సమగ్ర సర్వే చేపడతామని తహసీల్దారు వెల్లడించారు.

నాయుడుపేట గురుకులంలో

మరోసారి కలకలం

- గత నెల ఘటన మరువక ముందే కలుషితాహారంతో 12మందికి అస్వస్థత
- గోప్యంగా ఉంచిన అధికారులు



గురుకుల విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దారు, మున్సిపల్ కమిషనర్



చికిత్స పొందుతున్న విద్యార్థులు మహేష్, హరి

నాయుడుపేట/నాయుడుపేట టౌన్,ఆగస్టు 28: నాయుడుపేట బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మరోసారి కలకలం రేగింది.గత నెల 15వ తేదీ కలుషితాహారంతో సుమారు 150మంది విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రుల పాలైన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి కార్యాలయం ఈ ఘటనపై ఆరా తీసి చర్యలు తీసుకోవాలంటూ ఆదేశించడం, మంత్రి బాల వీరాంజనేయస్వామి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే విజయశ్రీ, ఉన్నతాధికారులు గురుకులాన్ని తనిఖీ చేసి పారిశుధ్య లోపం ఉన్నట్లుగా గుర్తించడం,సిబ్బంది నిర్లక్ష్యంపై ప్రభుత్వానికి నివేదికలు పంపడం తెలిసిందే.అలాగే రూ.56 లక్షలను కేటాయించి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు.అయితే ఆ ఘటనకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడంతో గురుకుల సిబ్బంది పనితీరులో మార్పురానేలేదు.ఈ క్రమంలోనే మరోసారి 12మంది విద్యార్థులు కలుషితాహారంతోనే ఆస్పత్రి పాలయ్యారు. గురుకుల పాఠశాలలో మంగళవారం రాత్రి భోజనంలో చికెన్ వడ్డించారు.ఇక్కడున్న 650 మంది విద్యార్థుల్లో 380 మంది మాత్రమే చికెన్ తిన్నారు. తిన్న కాసేపటికే కొంతమంది విద్యార్థులు కడుపునొప్పితో అల్లాడిపోయారు. ఆపై వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. అక్కడే ఉన్న వార్డెన్‌కు తమ పరిస్థితిని వివరించారు. ఆయన సూచనల మేరకు పాఠశాల కాంపౌండర్ వద్దకెళ్లి ఆయన ఇచ్చిన మందులను వేసుకున్నారు. అయినా పరిస్థితిలో మార్పు రాకపోవడంతో సిబ్బంది వారిని నాయుడుపేట-శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో ఉన్న హెల్త్‌సబ్ సెంటర్‌కు తరలించి వైద్యం అందించారు.ఈ ఘటనను బయటకు తెలియనీయకుండా చేయాలని గురుకులం అధికారులు విశ్వప్రయత్నాలు చేశారు. అందులో భాగంగానే నాయుడుపేట పట్టణంలో పీహెచ్‌సీ ఉండగా, అక్కడికి తీసుకువెళ్లకుండా ఆరోగ్య ఉపకేంద్రంలో వైద్యాన్ని అందించి అప్పటికప్పుడు కొంతమంది విద్యార్థులను ఇళ్లకు పంపివేయడం చర్చనీయాంశమైంది.సోషల్‌మీడియాలో ఈ విషయాన్ని తెలుసుకున్న తహసీల్దారు గీతావాణి హుటాహుటిన పాఠశాలకు వెళ్లి సిబ్బందిపై అసహనం వ్యక్తం చేసినట్లుగా సమాచారం. దీనిపై పాఠశాల ప్రిన్సిపాల్ దాదాపీర్ మాట్లాడుతూ... 380మంది విద్యార్థులు చికెన్ తినగా అందులో 12మంది మాత్రమే అస్వస్థతకు గురయ్యారని తెలిపారు.చికెన్ చెడిపోయివుంటే అందరూ అస్వస్థతకు గురికావాలి కదా అన్నారు.

మ్యూచువల్ అయితేనే

బదిలీకి ఆమోదం

- ముగ్గురు కలెక్టర్ల నిర్ణయం
- రేపు సచివాలయ ఉద్యోగులకు కౌన్సెలింగ్


చిత్తూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు జరుగుతున్న విషయం తెలిసిందే. చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి తిరుపతి జిల్లాకు వెళ్లేందుకు ఎక్కువ మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై ఓ నిర్ణయం తీసుకునేందుకు చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు సుమిత్‌కుమార్, వెంకటేశ్వర్, శ్రీధర్ బుధవారం వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించుకున్నారు. చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి తిరుపతికి వెళ్లేందుకు ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరికి అనుమతిస్తే ఈ రెండు జిల్లాలు ఖాళీ అయిపోతాయని కలెక్టర్లు సుమిత్‌కుమార్, శ్రీధర్ అభిప్రాయపడ్డారు. మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ అయితే తప్ప, రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్‌కు అనుమతి ఇవ్వకూడదని నిర్ణయం తీసుకున్నారు. ఈ లెక్కన తిరుపతి నుంచి చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు వచ్చేవాళ్లు లేకపోవడంతో బదిలీలు ఎక్కువ స్థాయిలో జరగకపోవచ్చు.ఇప్పటికే కుప్పం నియోజకవర్గంలోని ప్రతి శాఖలోనూ ఉద్యోగుల ఖాళీలు అధికంగా ఉన్నాయి. సీఎం నియోజకవర్గంలో ఖాళీల్ని భర్తీ చేయాల్సిన అవసరముంది.ఈ నేపథ్యంలో చిత్తూరు జిల్లా నుంచి ఉద్యోగుల్ని మ్యూచువల్ లేకుండా రిలీవ్ చేసే అవకాశాలు లేవు.

1740 మంది సచివాలయ ఉద్యోగుల దరఖాస్తు

సచివాలయ ఉద్యోగుల బదిలీలకు శుక్రవారం కౌన్సెలింగ్ జరగనుంది. మూడు జిల్లాల పరిధిలో ఇప్పటికి మొత్తం 1740 దరఖాస్తులు అందాయి. ఇందులో మ్యూచువల్ కోసం 183, మెడికల్ గ్రౌండ్స్ కింద 114 దరఖాస్తులున్నాయి. మిగిలినవన్నీ రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్లే ఉన్నాయి. ఇక్కడ కూడా మ్యూచువల్ బదిలీలకే ప్రాధాన్యమిస్తున్నారు. సింగిల్ పేరెంట్, స్పౌస్, డిసేబుల్డ్ పేరెంట్స్, చిల్డ్రన్స్ వంటి సమస్యలున్నవారికి మానవతా దృక్పథంతో బదిలీ చేసే అవకాశాలు ఉన్నాయి. అది కూడా అందరికీ కాకుండా అర్హులను గుర్తించి ప్రాధాన్యమిచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మున్సిపాలిటీలోని వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియను అనంతపురంలోని ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. కానీ, ఓ జిల్లా ఉద్యోగుల్ని మరో జిల్లాకు బదిలీ చేయాలంటే తొలుత ఆయా మున్సిపల్ కమిషనర్ల నో డ్యూ సర్టిఫికెట్ సంపాదించాలి. ఆ తర్వాత కలెక్టర్లు అర్హతల్ని పరిశీలించి రిలీవ్ చేయాల్సి ఉంటుంది.

- అధికారులు పట్టించుకోకపోవడంతో వెస్ట్ పోలీసులకు కుమారుడి ఫిర్యాదు

స్విమ్స్‌లో రోగి అదృశ్యం



సీతారామప్ప

తిరుపతి (వైద్యం), ఆగస్టు 28 : ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్న రోగుల భద్రత పూర్తిగా ఆ ఆస్పత్రి అధికారులదే. అయితే ఆరోగ్యం క్షీణించి ఎంఐసీయూలో చికిత్స పొందుతున్న రోగి అకస్మాత్తుగా కనిపించకుండా పోయినా తమకు సంబంధం లేదంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పరిస్థితి స్విమ్స్‌లో నెలకొంది. స్విమ్స్‌లో డాక్టర్లకే రక్షణ లేదంటూ వారం రోజులుగా జూనియర్ డాక్టర్లు నిరసన కార్యక్రమాలు చేపట్టిన విషయం మరువక ముందే చికిత్స పొందుతున్న రోగి అదృశ్యం అవడం స్విమ్స్‌లో సెక్యూరిటీ నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచింది. బాధితుల కథనం మేరకు....అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం బూరగమాకులపల్లెకు చెందిన టి.సీతారామప్పను చికిత్స కోసం కుటుంబ సభ్యులు మంగళవారం స్విమ్స్‌కు తీసుకువచ్చారు.ఓపీలోని వైద్యులు పరీక్షించి ఊపిరితిత్తుల్లో నీరు చేరిందని,చికిత్స అందించి ఆ నీటిని తొలగించాలని చెప్పారు. ఇందుకు తక్షణమే అడ్మిట్ కావాల్సి ఉంటుందని డాక్టర్లు చెప్పడంతో సీతారామప్పను ఆయన కుమారుడు విశ్వనాథ్ తన వద్ద ఉన్న రూ. 5 వేలు చెల్లించి అడ్మిట్ చేశారు.శ్రీపద్మావతి భవనంలోని నాలుగో అంతస్తులో ఉన్న ఎంఐసీయూలో అడ్మిషన్‌లో ఉన్న సీతారామప్పను వైద్యు లు మంగళవారం రాత్రి మరోసారి పరీక్షించి బుధవారం చికిత్స చేస్తామని, అప్పటి వరకు వాడమంటూ కొన్ని మందులు రాసిచ్చారు.ఆ మందులు వేసుకొని పడుకున్న సీతారామప్ప మంగళవారం అర్థరాత్రి మూత్ర విసర్జన కోసం ఒకసారి లేవడంతో విశ్వనాథ్ తీసుకువెళ్లి తిరిగి తీసుకువచ్చి పడుకోబెట్టాడు.విశ్వనాథ్ కూడా ఆ పక్కనే నిద్రకు ఉపక్రమించాడు. తిరిగి రెండు గంటల సమయంలో విశ్వనాథ్ లేచి చూడగా పడకపై సీతారామప్ప కనిపించలేదు. దీంతో కంగారు పడిన విశ్వనాథ్ ఆ భవనం అంతా వెతికినా తండ్రి కనిపించకపోవడంతో సెక్యూరిటీ సిబ్బందికి విషయం చెప్పాడు.వారేమాత్రం పట్టించుకోకుండా ఇక్కడే ఎక్క డో ఉంటాడులే అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో తెల్లవారుజాము వరకు వెతుకుతూనే ఉన్నాడు. బుధవారం మరోసారి స్విమ్స్ ఆవరణ మొత్తం వెతికినా ఫలితం లేకపోవడంతో చివరకు విషయాన్ని స్విమ్స్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాడు. దీంతో ఉద యం 10 గంటల సమయంలో ఎంఐసీయూ వార్డుకు వచ్చిన స్విమ్స్ అధికారులు విచారణ చే ప ట్టా ర ు. రోగిని భద్రంగా చూసుకోకుండా ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని విశ్వనాథ్‌నే మందలించారు.మీరు చెల్లించాల్సిన నగదు బ్యాలెన్స్ చెల్లించాలని ఒత్తిడి చేశారు. తన తండ్రి ఆచూకీ తెలిశాకే నగదు పూర్తిగా చెల్లిస్తానని విశ్వనాథ్ అధికారులకు తెగేసి చెప్పాడు.ఎంఐసీయూలో ఉన్న తన తండ్రి బయటకు వచ్చే అవకాశం లేదని కనీసం ఆయన మెట్లు కూడా దిగలేడని ఎంత చెప్పినా వారు వినిపించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో చేసేదేమీలేక బుధవారం మధ్యాహ్నం వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన తండ్రి ఆరోగ్య పరిస్థితి మాత్రమే బాగాలేదని, మానసిక పరిస్థితి బాగానే ఉందని ఇలా ఆయన చెప్పకుండా ఒక్కడే ఎక్కడకూ వెళ్లడని పేర్కొన్నాడు.అయిన వారిని వైద్యం కోసం తీసుకువచ్చే సహాయకులను కనీసం వార్డుల్లోకి కాదు కదా భవనంలోకి కూడా అనుమతించకుండా స్విమ్స్ సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని, దీంతో భవనం బయటే రాత్రిళ్లు సహాయకులు ఇబ్బంది పడుతూ ఉండాల్సి వస్తోందని తెలిపాడు.

రైల్వే జంక్షన్‌లో వసతుల కరువు

- 4,5 ప్లాట్‌ఫాంలపై అరకొరగా షెల్టర్లు
- పడమర వైపు నిరుపయోగంగా టిక్కెట్ కౌంటర్





4, 5 ప్లాట్‌ఫారాల్లో అసంపూర్తిగా ఉన్న షెల్టర్ - పడమర వైపు నిరుపయోగంగా టిక్కెట్ కౌంటర్

గూడూరు, ఆగస్టు 28: స్థానిక రైల్వేస్టేషన్‌లో వసతులు సరిగ్గా లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గూడూరు రైల్వే జంక్షన్ కావడంతో ప్రయాణికులు రద్దీ ఎక్కువగా ఉంటుంది. రైల్వేస్టేషన్ మీదుగా విజయవాడ, తిరుపతి, చెన్నైలకు నిత్యం సుమారు 70 ప్యాసింజర్లు, ఎక్స్‌ప్రెస్‌లు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. విజయవాడ, చెన్నై నుంచి వచ్చే శ్రీవారి భక్తులు గూడూరు రైల్వేస్టేషన్‌లో దిగి తిరుపతికి వెళ్తుంటారు. దీంతో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం ఏడాదిన్నర క్రితం కొత్తగా 4,5 ప్లాట్‌ఫాంలను ఏర్పాటు చేశారు. అయితే కొంత వరకు మాత్రమే షెల్టర్లను నిర్మించారు. దీంతో తాము ఎక్కాల్సిన రైళ్లలోని బోగీల వద్ద వేచి ఉండే ప్రయాణికులు ఎండ, వానకు ఇబ్బంది పడుతున్నారు. షెల్టర్ దాటి కోచ్‌లు ఆగిన సమయంలో ప్రయాణికులు పరుగులు తీస్తూ జారిపడిన సంఘటనలున్నాయి. 4,5 ప్లాట్‌ఫాంలపై సరైన మరుగుదొడ్ల సౌకర్యం, వెయిటింగ్ రూం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని పడమర వైపు నుంచి వచ్చే ప్రయాణిలకు సౌకర్యవంతంగా ఉండేలా గతంలో నిర్మించిన టిక్కెట్ విక్రయకేంద్రం మూతపడింది. పడమరవైపు నుంచి వచ్చే ప్రయాణికులు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి మీదుగా 1వ నెంబరు ప్లాట్‌ఫాంకు చేరుకుని తూర్పువైపు ఉన్న టిక్కెట్ కౌంటర్‌లో టిక్కెట్ కొనుగోలు చేయాల్సి ఉంది. ప్లాట్‌ఫాంలు దాటేందుకు ఉత్తరం వైపు ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి లిఫ్ట్ సౌకర్యం ఉంది. అదేవిధంగా దక్షణం వైపు ఫుట్ ఓవర్ బ్రిడ్జికి కూడా లిఫ్ట్ సౌకర్యం కల్పించాల్సి ఉంది. రైల్వేస్టేషన్ ఆవరణలో ఏటీఎం సెంటర్, పార్కింగ్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రధానంగా టిక్కెట్లు రిజర్వేషన్ చేయించుకునేందుకు కౌంటర్‌కు వచ్చే వారు, తమ వారిని రైళ్లలో ఎక్కించేందుకు, రైళ్లలో వచ్చిన వారిని తీసుకువెళ్లేందుకు వచ్చే వారు ద్విచక్రవాహనాలను రైల్వేస్టేషన్ ముందు వుంచి వెళ్లి వచ్చే సరికి రైల్వే అధికారులు అపరాధరుసుం విధిస్తున్నారు. వాహనాలను స్టేషన్ ముందు ఉన్న స్టాండ్‌లో నగదు చెల్లించి పార్కింగ్ చేసుకోవాలని సూచిస్తున్నారని చెబుతున్నారు. ఇకనైనా రైల్వే ఉన్నతాధికారులు స్పందించి రైల్వేస్టేషన్‌లో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధికారుల్లో బదిలీల హడావుడి

తడ, ఆగస్టు 28: కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ప్రక్రియ కొనసాగుతోంది. అయితే మండలస్థాయిలో అధికారులు తమకు అనువైనచోట పోస్టింగ్ కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఇంచుమించుగా అన్ని శాఖల్లో బదిలీ ప్రక్రియ పూర్తికాగా పంచాయతీరాజ్‌లో నెలాఖరుకు పూర్తికానుంది. దీంతో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగుల్లో హడావుడి కన్పిస్తోంది. ఏ ఇద్దరు, ముగ్గురు ఉద్యోగులు కలసినా ఇదే విషయంపై చర్చించుకుంటున్నారు. దాంతోపాటు స్థానిక నాయకుల అండదండలు, సిఫారస్సుల కోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారు. మండల పరిధిలోని పంచాయతీరాజ్ అధికారులే కాకుండా గూడూరు నియోజకవర్గంలోని అధికారులు, తడ మండలానికి వచ్చేందుకు ఆసక్తి చూపుతుండడం గమనార్హం. ఇలా అధికారులు, సిబ్బంది బదిలీల హడావుడితో తిరుగుతుండడంతో సచివాలయాలన్నీ బోసిపోతున్నాయి. మరో రెండు రోజుల్లో ఈ బదిలీల ప్రక్రియ పూర్తికానున్నడంతో అప్పటి వరకు ఈ కార్యాలయాలన్నీ ఇలాగే కన్పించే అవకాశం ఉంది. శుక్ర, శనివారాల్లో నెల్లూరు జిల్లాపరిషత్ కార్యాలయంలో ఈ మేరకు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న అధికారులు కౌన్సెలింగ్ హాజరుకావాలంటూ నెల్లూరుజిల్లా పంచాయతీ అధికారి ఎం.సుష్మిత బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

తడ ఎస్ఐ బాధ్యతల స్వీకారం



కొండపనాయుడు

తడ, ఆగస్టు 28: తడ ఎస్ఐగా కె.కొండపనాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయంలో వీఆర్‌లో ఉన్న కొండపనాయుడిని మంగళవారం రాత్రి తడ ఎస్ఐగా నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు బుధవారం మధ్యాహ్నం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అలాగే ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తుండిన నరసింహా రావును వీఆర్‌కు బదిలీ చేశారు.

పైపులైను నిర్మాణంలో గుడులను తొలగించొద్దు



పైపులైను నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

డక్కిలి, ఆగస్టు 28: సోమశిల-స్వర్ణముఖి పైపులైను నిర్మాణంలో గుడులను తొలగించ వద్దని భూసేకరణ విభాగ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నరసింహారావు అన్నారు. బుధవారం ఆయన వెలికల్లు గ్రామం వద్ద ఏపీఐఐసీ ఆధ్వర్యంలో జరుగుతున్న పైపులైను నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామల్లో పైపులైను నిర్మాణంలో గుడులు, బడులు అడ్డం వస్తే వాటిని తప్పించి చేపట్టాలని సూచించారు. వెలికల్లు, మార్లగుంటల వద్ద చిన్నచిన్న గుడులు పైపలైన్ నిర్మాణానికి అడ్డంకిగా వుండడాన్ని గుర్తించిన ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా అసైన్డ్, పట్టా భూముల్లో పైపులైను వెళ్తే సబ్‌రిజిస్ట్రార్ సూచించిన మార్కెట్ విలువను బట్టి రైతులకు పరిహారం చెల్లిస్తామని చెప్పారు. ఎఫ్ఎల్ఆర్, అడంగల్, రికార్డులు పరిశీలించాకే పరిహారానికి సిఫార్సు చేయాలని తహసీల్దార్ శ్రీనివాస రావుని ఆదేశించారు. కాగా సోమశిల-స్వర్ణముఖి పైప్‌లైన్ కండలేరు జలాశయం నుంచి నాయుడుపేట సెజ్‌లతో పాటు శ్రీసిటీ లోని పరిశ్రమలకు నీటిని అందిస్తుంది. గత వైసీపీ ప్రభుత్వంలో స్తబ్దుగా ఉన్న ఈ పనులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఊపందుకున్నాయి.

ఆర్చి శంకుస్థాపన పూజల్లో కురుగొండ్ల



పూజ చేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

డక్కిలి, ఆగస్టు 28: మండలంలోని దేవుని వెల్లంపల్లి సెంటరులో నిర్మిస్తున్న స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయానికి సంబంధించిన ఆర్చి నిర్మాణ శంకుస్థాపన పూజల్లో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పాల్గొన్నారు. మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి దేవస్థానికి డక్కిలి బస్టాండు మీదుగా చేరుకోవాలి. ఈ మార్గంలో డక్కిలికి చెందిన పూల రవి తన తల్లి దండ్రుల జ్ఞాపకార్థం సొంత నిధులతో ఆర్చిని నిర్మిస్తున్నారు. అనంతరం డక్కిలి టీడీపీ నాయకుడు డి.రత్నాహర రెడ్డి కుమారుడి నలుగు కార్యక్రమానికి ఎమ్మెల్యే హజరయ్యారు. ఎమ్మెల్యే వెంట పి.రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, ఏ.రామచంద్రయ్య నాయుడు, జి. చంద్రశేఖరరెడ్డి, మాధవరెడ్డి, ఏ.శ్రీరాములు, డి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌పై అవగాహన పెంచుకోవాలి

కోట, ఆగస్టు 28 : ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో కొత్త యాప్‌ల ద్వారా ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ విధానంపై ప్రతి కార్యకర్తా అవగాహన పెంచుకోవాలని సీడీపీవో మునికుమారి కోరారు. కోటలోని స్త్రీశిశు సంక్షేమ కార్యాలయంలో బుధవారం కోట ఐసీడీఎస్ ప్రాజెక్టు అంగన్‌వాడీ వర్కర్లతో సెక్టార్ సమావేశంలో సీడీపీవో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ అవుతున్న ప్రతి పథకానికి సంబంధించిన లావాదేవీలు విధిగా ఆన్‌లైన్‌లోనే జరగాలన్నారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్లు కృష్ణమ్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.

సేఫ్టీ ఆడిట్‌లో గుర్తించిన భద్రతా లోపాలను సరిచేసుకోండి

- పరిశ్రమల యాజమాన్యాలకు కలెక్టర్, ఎస్పీ సూచన



పరిశ్రమల ప్రతిధులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్, ఎస్పీ

తిరుపతి(విద్య), ఆగస్టు 28: సేఫ్టీ ఆడిట్‌లో గుర్తించిన భద్రతా లోపాలను పరిశ్రమల యజమానులు సరిచేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. జిల్లాలోని వివిధ పరిశ్రమల ప్రతినిధులతో కలెక్టర్, ఎస్పీ సుబ్బరాయుడు బుధవారం కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పరిశ్రమలకు పెద్దపీట వేయడంతో పాటు కార్మికుల భద్రతకు కూడా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఇటీవల జిల్లాలోని పరిశ్రమల్లో ప్రమాదవశాత్తు ముగ్గురు మరణించారని, పరిశ్రమల్లో ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్త వహించాలని సీఎం ఆదేశించారని చెప్పారు. ఆమేరకు ఈసమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. పారిశ్రామికవేత్తలకు సుహృద్భావ వాతావరణం కల్పిస్తూ పరిశ్రమల విస్తరణకు పెద్దపీట వేస్తున్నామని, కార్మికుల భద్రత కూడా తమకు అత్యంత ప్రధానమని ముఖ్యమంత్రి వెల్లడించారని వారికి వివరించారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, అజాగ్రత్త ఎంతమాత్రం కూడదన్నారు. ఏదైనా ప్రమాదం జరిగిన సందర్భంలో జిల్లా యంత్రాంగానికి సమాచారం ఆలస్యంగా అందుతోందని, ఇకపై అలా జరగడానికి వీల్లేదన్నారు. యంత్రాంగానికి తక్షణం సమాచారం అందినప్పుడే తగుచర్యలు తీసుకునేందుకు, నష్టాన్ని నివారించేందుకు వీలౌతుందని చెప్పారు. జిల్లాలో అత్యంత ప్రమాదకర (ఎంఏహెచ్-ఏ) కేటగిరీ పరిశ్రమలు 12, ఎంఏహెచ్-బీ1, బీ2 కేటగిరీల్లో 107 పరిశ్రమలు ఉన్నాయని, భద్రతా ప్రమాణాలను పక్కాగా పాటించాలని ఆదేశించారు. సేఫ్టీ ఆడిట్ జరిగిందనే విషయం స్పష్టంగా కనబడేలా ప్రతి పరిశ్రమవద్ద డిస్‌ప్లే ఏర్పాటు చేయాలని సూచించారు. కార్మికులకు విధులు, విధి నిర్వహణలో వారు ఎదుర్కొనబోయే కష్టనష్టాల గురించి తెలియజేయాలని, ఎప్పటికప్పుడు విధులకు సంబంధించిన శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రతి పరిశ్రమలో రెండు నెలలకు ఒకసారి తప్పనిసరిగా ఫైర్ మాక్‌డ్రిల్ చేయాలని సూచించారు. ఆరు నెలలకొకసారి ఆన్‌సైట్ ఎమర్జెన్సీ మాక్‌డ్రిల్ నిర్వహించాలని చెప్పారు. అనంతరం ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ... తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించాలని, విపత్కర పరిస్థితుల్లో ఎమర్జెన్సీ ప్లాన్ సిద్ధంగా ఉండాలన్నారు. ఎంట్రీ, ఎగ్జిట్, హాస్పిటల్, ట్రాన్స్‌పోర్ట్‌కు సబంధించిన ప్రణాళికలు పక్కాగా ఉండాలని చెప్పారు. ప్రమాదకర పరిశ్రమల్లో సెక్యూరిటీ ప్లాన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్లాన్ బ్లూ ప్రింట్‌ను రెవెన్యూ, పోలీసు యంత్రాగానికి అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, పీసీబీ అధికారి మదన్‌గోపాల్, జిల్లా అగ్నిమాపశాఖ అధికారి రమణయ్య, బాయిలర్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాదరావు, అదనపు ఎస్పీలు వెంకట్రావు, జిల్లా పరిశ్రమల శాఖ ఇన్‌చార్జి అధికారి రామ్మూర్తి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ చంద్రశేఖర్, పీసీబీ ఏఈ మదన్‌మోహన్, అమరరాజ తదితర పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాతా పరమేశ్వరి ఆలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజలో ఎమ్మెల్యే తదితరులు

గూడూరు, ఆగస్టు 28: పట్టణంలోని దండోరా నగర్‌లో బుధవారం మాతా పరమేశ్వరి అమ్మవారి ఆలయ శంకుస్థాపన పూజల్లో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకుని ప్రశాంత జీవనం గడపాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు, పెంచలకోన ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజీ, ఎస్.భాస్కర్‌రెడ్డి, ఎ.మస్తాన్‌నాయుడు, బి.చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, పెంచలయ్య, రమణయ్య, జనార్దన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకారం

దొరవారిసత్రం, ఆగస్టు 28 : దొరవారిసత్రం మండల అభివృద్ధి అధికారిగా బి. సింగయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికలకు ముందు ఎలక్షన్ కమిషన్ ఆదేశాలతో దొరవారిసత్రం నుంచి చిత్తూరు జిల్లా యాదమరి మండలానికి బదిలీపై వెళ్లారు. తిరిగి అదే స్థానంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆయన బాధ్యతలు చేపట్టారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోండి



సీఐని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు అర్బన్, ఆగస్టు 28: రెండో పట్టణ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని టీడీపీ నాయకులు కోరారు. బుధవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ శ్రీనివాస్‌కు టీడీపీ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి పలు సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ రెండోపట్టణ పరిధిలోని అండర్‌బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేలా, గంజాయి అక్రమ వ్యాపారాన్ని, జూదాన్ని అడ్డుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఎస్.భాస్కర్‌రెడ్డి, ఎ.మస్తాన్‌నాయుడు, బి. చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, ఇశ్రాయిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయండి

- మాజీ ఎంపీ నెలవల

ఓజిలి, ఆగస్టు 28: మండలంలో ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకంపై దృష్టి పెట్టాలని మాజీ ఎంపీ, సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం కోరారు. ఓజిలిలోని టీడీపీ నాయకుడు జయ చంద్రారెడ్డి తల్లి కర్మక్రియలకు హాజరైన ఆయన ఉపాధి హామీ ఏపీఓ ఉషారాణితో మాట్లాడారు. పథకంలో పనులు సక్రమంగా జరిగేందుకు ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాలపై దృష్టి పెట్టాలని కోరారు. అంతకుముందు ఆయన నాయకులతో కలసి జయచంద్రారెడ్డి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.వెంకటసుబ్బయ్య, పార్టీ మండల కన్వీనర్ విజయకుమార్‌నాయుడు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి కె.సత్యవరప్రసాద్‌రావు, నాయకులు ఎస్‌కె ఖలీల్, అల్లాబక్షు, పురుషోత్తంరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికలను సద్వినియోగం చేసుకోండి

కోట, ఆగస్టు 28: మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో ఈనెల 30న గ్రీన్‌ల్యాంప్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రామకృష్ణారెడ్డి తెలిపారు. ఇక్కడి కళాశాలలో 2022, 23, 24 సంవత్సరాల్లో డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు జరుగుతాయన్నారు. డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శరత్‌కుమార్‌రెడ్డి, కోఆర్డినేటర్ రాజేష్‌లు తెలిపారు.

అధికారులు బాధ్యతగా పని చేయడం లేదు

మండల సమావేశంలో సర్పంచుల ఆవేదన



తొగరా ముడి ఆస్పత్రి సిబ్బంది పనితీరుపై సభ దృష్టికి తీసుకువస్తున్న సర్పంచు ప్రసాద నాయుడు

దొరవారిసత్రం, ఆగస్టు 28: మండలంలో కొన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమ విధులను బాధ్యతగా నిర్వహించడం లేదని పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండల సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ డిసుజాతమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అక్కరపాక, నెల్లూరుపల్లి, ఆనేపూడి, తొగరాముడి గ్రామాల సర్పంచులు అధికారుల పనితీరుపై మండిపడ్డారు. తమలకు గౌరవం ఇవ్వడం లేదని, వైద్యశాఖ అధికారుల పనితీరు బాగా లేదని తెలిపారు. తొగరాముడి వైద్యశాలను సాయంత్రం 4 గంటలకు మూసేసి వెళ్లిపోతున్నారని, ఆస్పత్రి రోగులతో కాకుండా, పశువులతో ఉంటోందని సర్పంచు ప్రసాదనాయుడు సభ దృష్టికి తీసుకొచ్చారు. దొరవారిసత్రం పీహెచ్‌సీ నుంచి వైద్యులు సమావేశానికి హాజరు కాకపోవడంపై మండిపడ్డారు. అలాగే ట్రాన్స్‌కో ఏఈ గైర్హా జరీపై నోటీసులు ఇవ్వాలని కోరారు. పశువైద్యశాఖ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని, వ్యవసాయ, హార్టికల్చర్ పథకాలు, రాయితీలు రైతులకు అందించేలా పనిచేయాలని కోరారు. జీలగలు, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయాలని కోరారు. జడ్పీటీసీ సభ్యుడు రమేష్, ఉప ఎంపీపీ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, తహసీల్దారు శైలకుమారి, ఇన్‌చార్జి ఎంపీడీవో రఘురామయ్య, డీఎల్‌డీవో వెంకటశేషయ్య, సీడీపీవో శారదాంబ సహా పలు అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల వితరణ



వెంకటగిరి టౌన్, ఆగస్టు 28: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా జనసేన ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్థానిక కుమ్మరిమిట్టలో బుధవారం విద్యార్థులకు పుస్తకాలు వితరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 2వ తేది వరకు వివిధ రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. శేఖర్, కిషోర్ బాబు, మునిచంద్ర, పృథ్వీరాజ్, గురునాథం, రిజ్వానా బాషా, పురుషోత్తం పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించండి



మాతా శిశు మరణాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిల్లకూరు, ఆగస్టు 28: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్యాధికారులు, సిబ్బంది మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సూచించింది. బుధవారం మండల కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బందికి మాతాశిశు మరణాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. రక్తశాతం తక్కువగా ఉన్న వారిని గుర్తించి వైద్యుల వద్దకు తీసుకువెళ్లాలని ఏఎన్ఎంలకు సూచించారు. అనంతరం ఓడూరు ఉపకేంద్రంలో రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం ప్రతినిధులు డాక్టర్లు శ్రీనివాసరావు, నాగేంద్రకుమార్, బేబిరాణి, ప్రకాశ్, పీహెచ్‌సీ డాక్టర్లు షాలోం అరాఫత్, పాల్‌జాన్సన్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కృష్ణస్వామి ఆలయ కుంభాభిషేకం





కుంభాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు - స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం



ఎమ్మెల్యే విజయశ్రీ దంపతులకు ఆశీర్వచనం

సూళ్లూరుపేట, ఆగస్టు 28: పట్టణ సమీపంలోని మన్నారు పోలూరులో కొలువై ఉన్న ఉన్న సత్య జాంబవతి సమేత అలఘు మల్లారి కృష్ణస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా జరుగుతున్న అష్టబంధన కుంభాభిషేక వేడుకలు ముగిశాయి. ఈ వేడుకల్లో భాగంగా బుధవారం వేదపండితుల ఆధ్వర్యంలో ఆలయ ముందు కలశ పూజ చేసి కలశాల్లో ఉన్న పవిత్ర జలాలతో ఆలయ గోపురంపై ఉన్న కలశాలకు అభిషేకం చేసి మహా సంప్రోక్షణ నిర్వహించారు. కుంభాభిషేక జలాలను భక్తులపై చల్లారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే విజయశ్రీ కుటుంబ సభ్యులతో విచ్చేశారు. టీటీడీ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఆలయ ఇన్‌స్పెక్టర్ లోకేశ్‌రెడ్డి ఎమ్మెల్యే దంపతులకు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికి వేద పండితులతో ఆశీర్వచనం ఇప్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి స్వామివారి కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో శ్రీసిటీ ఎండీ సన్నారెడ్డి రవీంద్ర రెడ్డి దంపతులు పాల్గొన్నారు. కల్యాణం అనంతరం తిరువీధి ఉత్సవం నిర్వహించారు.

భూసర్వే పక్కాగా నిర్వహించాలి



సిబ్బందికి సూచనలిస్తున్న సర్వేయర్

కోట, ఆగస్టు 28: భూ సర్వేలో ఎక్కడా లోపాలకు తావు లేకుండా నిర్వహించాలని మండల సర్వేయర్ రామ్‌కుమార్ ఆదేశించారు. తహసీల్దారు కార్యాలయంలో బుధవారం 16 గ్రామ సచివాలయాల సర్వేయర్లకు భూ సర్వేపై శిక్షణ జరిగింది. కొత్తపట్నం పంచాయతీలో జరుగుతున్న చెన్నై, బెంగళూరు ఇండస్ట్రియల్ కోస్టల్ కారిడార్ భూముల్లో మిగిలిపోయిన సర్వేను వేగవంతం చేయాలన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయ వార్షికోత్సవం



పెళ్లకూరు, ఆగస్టు 28: పెళ్లకూరు గ్రామంలో బుధ వారం శ్రీదేవి, భూదేవి సమేత చెన్న కేశవ స్వామి ఆలయ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన, హోమం వంటి ప్రత్యేక పూజ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్‌దీపాలు, పూలతో తీర్చిదిద్దారు. స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

పాండురంగడి గ్రామోత్సవం



సూళ్లూరుపేట, ఆగస్టు 28: పట్టణం లోని రుక్మిణి సమేత పాండురంగ స్వామి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న కృష్ణాష్టమి వేడుకలు బుధవారంతో ముగిశాయి. ఈ వేడుకల్లో భాగంగా ముగింపు రోజు స్వామి వారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తుల కోలా టాలు, భజన బృందాల నడుమ ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణంలో ఊరేగించారు. అంతకుముందు ఉదయం స్వామివారికి అభిషేకం చేసి విశేష పూజలు చేశారు. మధ్నాహ్నం అన్నదానాన్ని ఎమ్మెల్యే విజయశ్రీ ప్రారంభించారు. ఆలయ నిర్వాహకులు ఎం.బాలసుబ్రమణ్యం, టీడీపీ నాయకులు ఏ.రమేష్, ఏజి కిషోర్, వి.రమేష్, చిట్టేటి పెరుమాల్, పి.శ్రీనివాసులు, ఎ.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఫిజియో మీటర్ల పరిశీలన

కోట, ఆగస్టు 28 : పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న ఫిజియో మీటర్లను బుధవారం భూగర్భ జల, జలగణన శాఖ జియాలజిస్టు రాజారాం పరిశీలించి కొలతలు తీశారు. మండలంలోని వంజివాక, కోట, చిట్టమూరు మండలం మెట్టులో ఉన్న ఈ ఫిజియో మీటర్ల ద్వారా భూగర్భ జల మట్టాన్ని కొలతలు తీస్తున్నామన్నారు. ఈ ప్రాంతంలో 6, 7, 8 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉన్నాయని రాజారాం తెలిపారు. జిల్లాలోని 33 మండలాల్లో 88 ఫిజియో మీటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.